

తెలంగాణలో ఉత్తమ స్వచ్ఛ నగరం జీహెచ్ఎంసీ

స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో ఎంపిక

అవార్డు ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీముర్ము

- మిగతా 4లో...

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణలో ఉత్తమ స్వచ్ఛనగరంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిలిచింది. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ నిర్వహించిన స్వచ్ఛసర్వేక్షణ్ 2025-26లో హైదరాబాద్‌కు దక్కిన ఈ అవార్డును బుధవారం ఇక్కడి విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీకర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌లు అందుకున్నారు. జాతీయస్థాయిలో మెంటార్-మెంటీ సిటీస్, స్వచ్ఛ నగరాల లీగ్, 10 లక్షలకుపైగా, 3 నుంచి 10 లక్షలు, 50 వేల నుంచి 3 లక్షలు, 20 వేల నుంచి 50 వేలు, 20 వేల లోపు జనాభా, నదీ,



ప్రతి పేద విద్యార్థి ఉన్నత విద్యను అందుకోవడమే లక్ష్యం

ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన

హైదరాబాద్ పెన్ పవర్: ప్రపంచంతో తెలంగాణ రాష్ట్రం పోటీపడేలా చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యావ్యవస్థను పటిష్ఠం చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నతవిద్యను అందుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. హనుమకొండ జిల్లా కాజీపేట విద్యానగర్‌లో రూ.10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్(టీపీఎస్) భవన నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా సెమీ రెసిడెన్షియల్ విధానంలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అధునాతన బోధన పద్ధతులు, డిజిటల్ తరగతుల నిర్వహణ, పాఠశాలలోనే అల్పాహారం, మధ్యాహ్న భోజనం, విద్యార్థులను ఇళ్ల నుంచి తీసుకొచ్చి తిరిగి ఇళ్ల వద్దకు చేర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. బోధన, బోధనేతర సిబ్బందికి వసతి కల్పనతోపాటు ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యనభ్యసించేలా పబ్లిక్ పాఠశాలలు రూపొందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కుడా ఛైర్మన్ గుండు సుధారాణి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో సాగునీటిపై ఉత్తమ్‌తో తుమ్మల చర్చ

సీతమ్మసాగర్ అనుమతులు, సీతారామ పనుల వేగవంతంపై దృష్టి పెట్టాలని వినతి

హైదరాబాద్ పెన్ పవర్: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, వరద రక్షణ పనులు, చెరువుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం సచివాలయంలో ఈ రెండు జిల్లాలకు సంబంధించి 15 కీలక సాగునీటి అంశాలపై చర్చించారు. "సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు పనులు ఎన్జీటీ కేసు కారణంగా నిలిచిపోయాయి. ఈ పనుల్ని తిరిగి ప్రారంభించేందుకు పర్యావరణ అనుమతులు సాధించాలి. సీతారామ ఎత్తిపోతల పథకంలోని జూలూరుపాడు టన్నెల్, ప్యాకేజీ-11 పంప్‌హౌస్ పనులను త్వరగా పూర్తిచేయండి. అలాగే 1, 2, 7, 8 ప్యాకేజీల పరిధిలోని గ్రావిటీ కాలువకు బదులుగా ప్రెజరైజ్డ్ పైప్డ్ ఇరిగేషన్ విధానం అమలుకు అనుమతులు మంజూరు చేయండి. వెంకమ్మ చెరువు వద్ద ప్రవాహ కాలువ నిర్మాణం, పెద్దవాగు ప్రాజెక్టు దెబ్బతిన్న కట్టకు శాశ్వత మరమ్మతులు, మరేళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రతిపాదనల్ని త్వరగా పరిష్కరించాలి. సాగునీటి రిజర్వాయర్లపై ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థతో కూడిన తేలియాడే సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటునూ పరిశీలించండి. ఖమ్మం జిల్లాలో మున్నేరు వరదలతో పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురవుతున్నందున ధంసలాపురం వరకు రక్షణ గోడ నిర్మించాలి. టేకులపల్లి వద్ద గైడ్‌వాల్, ధంసలాపురం పెద్దచెరువు, ఖానాపురం చెరువు అభివృద్ధి ప్రతిపాదనలను పరిశీలించండి. టేకులపల్లి వద్ద రెగ్యులేటర్ నిర్మించి లకారం చెరువుకు నీటిని మళ్లించేందుకు రూ.8 కోట్లు మంజూరు చేయాలి. మల్లెపూలవాగుకు శాశ్వత రక్షణ, బేతుపల్లి చెరువు సామర్థ్యం పెంపునూ పరిశీలించాలి" అని మంత్రి తుమ్మల... ఉత్తమ్‌ను కోరారు.

సమ్మక్క-సారక్క బ్యారేజీపై ప్రత్యేక సమీక్ష

మరోవైపు సమ్మక్క-సారక్క బ్యారేజీ సమస్యలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సచివాలయంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. బ్యారేజీకి సంబంధించిన సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. ఇందులో మంత్రి తుమ్మల, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను పట్టించుకోకుంటే 'రూ.10 వేల కోత'కు రంగం సిద్ధం

చట్టం అమలుకు నిబంధనల రూపకల్పన

ప్రభుత్వ ఆమోదమే తరువాయి...

హైదరాబాద్ పెన్ పవర్: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పట్టించుకోని ప్రభుత్వ ఉద్యోగుల వేతనం నుంచి నిర్దేశిత మొత్తాన్ని తగ్గించి... వారి ఖాతాల్లో జమచేయాలన్న చట్టం అమలుకు సర్కారు సిద్ధమైంది. ప్రతినెలా ఉద్యోగి మొత్తం వేతనంలో 15% లేదా రూ.10 వేలు ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని చెల్లించనుంది. దీనికి సంబంధించి ఇప్పటికే 'తెలంగాణ ఉద్యోగుల జవాబుదారీతనం, తల్లిదండ్రుల సహాయ పర్యవేక్షణ చట్టం-2026'ను ప్రభుత్వం ఆమోదించిన విషయం తెలిసిందే. తాజాగా దీని అమలుకు వయోవృద్ధుల సంక్షేమశాఖ నిబంధనలు రూపొందించి... ఆమోదానికి ప్రభుత్వానికి పంపించింది. కొత్త చట్టం కింద ఇప్పటికే రాష్ట్రంలో ఐదు ఫిర్యాదులు ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. హైదరాబాద్ నుంచి మూడు, కరీంనగర్, నిజామాబాద్‌ల నుంచి ఒక్కోటి చొప్పున ఉన్నాయి. నిబంధనల్లోని అంశాలివీ...

తమ సంతానం(కుమారుడు, కుమార్తె, దత్తత తీసుకున్నవారు) ప్రభుత్వ ఉద్యోగులై ఉండి... తమను పట్టించుకోకుండా ఉంటే.. ఆయా తల్లిదండ్రులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్లో జిల్లా కలెక్టర్ అధ్వర్యంలోని ప్రత్యేక అథారిటీకి దరఖాస్తు చేయాలి.

తాము జీవించేందుకు అవసరమైన ఆదాయ వనరుల్లేవని తెలపడంతోపాటు అన్ని వనరుల నుంచి నెలకు అందుతున్న ఆదాయం, ఇప్పటివరకు ఉద్యోగులైన సంతానం అందించిన సహాయానికి సంబంధించిన ఆధారాలనూ అందించాలి.

ఈ దరఖాస్తులు స్వీకరించాక.. రసీదు జారీ అవుతుంది. దరఖాస్తు వివరాలు సరైన విధానంలో ఉన్నట్లు ధ్రువీకరించిన పది రోజుల్లో బాధ్యుడైన ఉద్యోగికి నోటీసులు జారీ అవుతాయి.



నోటీసులతో పాటు తల్లిదండ్రులు ఇచ్చిన దరఖాస్తు, ఇతర ఆధార పత్రాల కాపీ ఇస్తారు. అనంతరం జిల్లా అథారిటీ ఆ ఉద్యోగిని పిలిచి వివరణ తీసుకుంటుంది. నోటీసులపై ఉద్యోగి గడువులోగా స్పందించకున్నా, విచారణకు రాకున్నా, వేతనం నుంచి కొంత మినహాయించి తల్లిదండ్రుల ఖాతాల్లో వేయాలని స్పీకింగ్ ఆదేశాలు జారీ చేస్తారు.

- మిగతా 4లో...

లంచం కేసులో నిజామాబాద్ మాజీ సీఐకి జైలు శిక్ష

- అవినీతి కేసులో నిజామాబాద్ మాజీ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు జైలు శిక్ష ఖరారు
- హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టు బుధవారం వెలువరించిన తీర్పు
- నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా
- 2011లో ధరావత్ బాలాజీపై కేసు నమోదు చేసిన అవినీతి నిరోధక శాఖ

- మిగతా 4లో...



పంజాగుట్ట ఠాణాలో ఏఐ పోలీసింగ్

దేశంలోనే తొలిసారి: సీపీ సజ్జనర్

హైదరాబాద్ పెన్ పవర్: పోలీసింగ్ వ్యవస్థలో నూతన సాంకేతిక విప్లవానికి హైదరాబాద్ వేదిక కానుందని, దేశంలోనే తొలిసారిగా కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత పోలీసింగ్ సేవలను పైలట్ ప్రాజెక్టుగా పంజాగుట్ట ఠాణాలో అమలు చేయనున్నామని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్(సీపీ) సజ్జనర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని పంజాగుట్ట ఠాణాను ఆయన సందర్శించారు. ఠాణాలో ఏఐ ఆధారిత సేవల అమలు కోసం చేపట్టిన ఆధునికీకరణ పనులను పరిశీలించారు.

- మిగతా 4లో...



ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. తెలంగాణ బస్ స్టేషన్లలో ఫ్రీ వైఫై!



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలోని బస్ స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే బస్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా 5 వేల మందికిపైగా ప్రయాణికుల రద్దీ ఉండే 86 బస్ స్టేషన్లను గుర్తించింది. వీటిలో దశలవారీగా ఉచిత వైఫై సదుపాయం అందుబాటులోకి తీసుకురానుంది.గుర్తించిన బస్ స్టేషన్లలో ఇప్పటికే ఒక్కో కంట్రోలర్‌ను నియమించింది. ప్రయాణికులు బస్సుల వివరాలు, రాకపోకల సమయాలు తెలుసుకునేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్లను ఏర్పాటు చేసింది. కొత్త టైమ్ టేబుల్ బోర్డులను కూడా అందుబాటులోకి తీసుకురానుంది.ప్రయాణికుల భద్రతతో పాటు బస్ స్టేషన్లలో రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మరో కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో అన్ని బస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనుంది. వీటిని సంబంధిత ప్రాంతీయ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయానికి అనుసంధానించనున్నారు. తద్వారా బస్ స్టేషన్లలో పరిస్థితులను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం ఉంటుంది.బస్ స్టేషన్లలో వసతులను మెరుగుపరచడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ప్రయాణికుల సౌకర్యాల కల్పనకు సంస్థ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ హౌస్ అరెస్ట్



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హనుమకొండ పర్యటన నేపథ్యంలో పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత దాస్యం వినయ్ భాస్కర్‌ను ఈ ఉదయం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. హనుమకొండ వడ్డేపల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు, ఆయన బయటకు రాకుండా నిర్బంధించారు.కాజీపేట పరిధిలోని వైఎస్సార్ నగర్ నివాసితులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలనే డిమాండ్‌పై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటనను అడ్డుకుంటామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. ఈ క్రమంలో వినయ్ భాస్కర్ స్పందిస్తూ... “వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు న్యాయం చేయకపోతే భట్టి పర్యటన అడ్డుకుంటాం. పట్టాలపై స్పష్టమైన ప్రకటన చేయాలి.. లేదంటే నిరసన తప్పదు” అని స్పష్టం చేశారు.ఈ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు అప్రమత్తమయ్యారు. వినయ్ భాస్కర్ ఇంటి వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, స్థానికంగా ఉన్న పలువురు బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలను కూడా ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారు.

మాతృమూర్తులను అగ్రస్థానంలో ఉంచాలి

మహిళలను గౌరవించే సంస్కృతి భారత్ సొంతం

త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి యతీంద్ర సప్తతి మహోత్సవాలలో సామాజిక సేవకులు, సైనికులు, శాస్త్రవేత్తలకు సత్కారం



హైదరాబాద్ పెన్ పవర్: ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా మహిళలను ఉన్నత స్థానంలో నిలిపే సంస్కృతి భారతదేశంలోనే ఉందని త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి పేర్కొన్నారు. జన్మనిచ్చిన మాతృమూర్తులను అగ్రస్థానంలో ఉంచడాన్ని ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని.. శ్రీరామచంద్రుడు, భగవద్రామానుజుల కాలాల్లో మహిళలకు దక్కిన గౌరవం అజరామరమన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని శ్రీరామనగరంలో కొనసాగుతున్న యతీంద్ర సప్తతి మహోత్సవాలు నాలుగో రోజైన బుధవారం వైభవంగా జరిగాయి. తొలుత జాతీయస్థాయిలో సామాజిక సేవలు అందిస్తున్న 70 మంది మహిళా సాధకులను, దేశ సైనికులను, శాస్త్రవేత్తలను బాగేశ్వర్ ధామ్ ఆశ్రమ స్వామీజీ ధీరేంద్రశాస్త్రి మహరాజ్, ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత భయ్యాజీ జోషితో కలిసి చినజీయర్ స్వామి శాలువాలతో సత్కరించి పురస్కారాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ... రామాయణంలో తల్లిదండ్రులు, భార్యాభర్తలు, అన్నదమ్ములు, గురుశిష్యుల అనుబంధాలు, త్యాగాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ధీరేంద్ర శాస్త్రి మహరాజ్ మాట్లాడుతూ.. బాగేశ్వర్‌ధామ్ ఆశ్రమంలోనూ నారీమణులను సత్కరించే కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. త్వరలో లక్ష కొబ్బరికాయలతో హనుమంతున్ని ఆరాధించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని చినజీయర్ స్వామిని ఆయన ఆహ్వానించారు.

అమ్మను ప్రేమగా చూసుకోవాలి: శైలజాకిరణ్

పురస్కారం అందుకున్న అనంతరం మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్ మాట్లాడుతూ... ‘కనిపెంచిన అమ్మను జీవితాంతం ప్రేమగా చూసుకోవడం సంతానం బాధ్యత. యతీంద్ర సప్తతి వేడుకల్లో స్వయంగా చినజీయర్ స్వామి సత్కరించడం నా అదృష్టం. పెద్దలతో గౌరవంగా ఎలా ఉండాలో తెలిసేలా చినజీయర్ స్వామి చాలా విషయాలు తెలిపారు. ఆయన ఆలోచనలు, ఆశయాలు చిన్నారులకే కాదు.. పెద్దలందరికీ తెలియాల్సిన అవసరం ఉంది’ అని పేర్కొన్నారు.

సీసీఐని తెరిపిస్తాం..
కేంద్రమూ సహకరించాలి

మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ ప్రారంభం



హైదరాబాద్ పెన్ పవర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మూతపడిన భారత్ సిమెంట్ పరిశ్రమ(సీసీఐ)ను కచ్చితంగా తెరిపిస్తామని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి విధానపరమైన సడలింపులు తీసుకురావాల్సిన బాధ్యత భాజపా ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లపై ఉందని తేల్చి చెప్పారు. ఆదిలాబాద్‌లో నిర్మించిన ఐటీ టవర్‌ను బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ... “భారాస ప్రభుత్వ హయాంలో ఐటీ టవర్‌కు నిధులు ఇవ్వలేదు. మా ప్రభుత్వం రూ.55 కోట్లు కేటాయించి నిర్మాణం పూర్తి చేసింది. ఈ టవర్‌లోకి ప్రస్తుతం మూడు ఐటీ కంపెనీలు వచ్చాయి. ఇంకా వంద సీట్లు ఖాళీగా ఉన్నాయి. కంపెనీలు ముందుకు వస్తే మరో ఐటీ టవర్ నిర్మాణానికి సిద్ధంగా ఉన్నాం. నూతన ఆవిష్కరణల కోసం త్వరలో ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తా. ఆదిలాబాద్ విమానాశ్రయం, పారిశ్రామిక కారిడార్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం” అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి; జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఇది పక్కా యాంటీ భారత్ సమిట్!

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా..రాహుల్‌గాంధీ, ప్రియాంకలు తెలంగాణలో అడుగుపెడితే అడ్డుకుంటామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు హెచ్చరించారు. “హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్నది భారత్ సమిట్ కాదు... అది పక్కా భారత వ్యతిరేక భేటీ(యాంటీ భారత్ సమిట్) అని విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో బుధవారం విలేకరులతో రామచందర్‌రావు మాట్లాడుతూ... “మొదట ఇది తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించేందుకు నిర్వహిస్తున్న సదస్సు అనుకున్నాం. రెండ్రోజులుగా సల్మాన్ ఖుర్షీద్, షికాగో నుంచి శామ్ పిట్రోడా ఎక్స్‌లో చేస్తున్న పోస్టులను గమనిస్తే ఇది కాంగ్రెస్ ఆధ్వర్యంలో విదేశీ శక్తులతో కలిసి చేస్తున్న కుట్రపూరిత సమావేశమని తేటతెల్లమవుతోంది. దేశంలో 130 కోట్ల మంది ప్రజల చేతిలో రాహుల్‌గాంధీ పదేపదే తిరస్కారానికి గురయ్యారు. ఇప్పుడు 100 దేశాల ప్రతినిధుల ముందు రాహుల్‌గాంధీని భావి ప్రధానిగా ప్రదర్శించడానికి ఈ వేదికను వాడుకుంటున్నారు. ‘ప్రోగ్రెసివ్ అలయెన్స్’ వెనుక అంతర్జాతీయంగా ప్రజాస్వామ్య ప్రభుత్వాలను కూలదోసే ప్రమాదకర శక్తులు ఉన్నాయి’ అని ఆయన ఆరోపించారు.

పంజాగుట్ట ఠాణాలో ఏఐ పోలీసింగ్

-3 పేజ తరువాయి

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఫిర్యాదు స్వీకరణ నుంచి కేసు దర్యాప్తు, అభియోగపత్రం రూపకల్పన వరకు ప్రతి దశలోనూ ఏఐ సాంకేతికతను వినియోగించేలా పంజాగుట్ట ఠాణాను ఆధునికీకరిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే నెల మొదటి వారంలో డీజీపీ సీవీ ఆనంద్ ఈ సేవలను ప్రారంభిస్తారని తెలిపారు. డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ మురళీకృష్ణ, పంజాగుట్ట ఠాణా ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఉత్తమ స్వచ్ఛ నగరం జీహెచ్ఎంసీ

-3 పేజ తరువాయి

సముద్రతీరం, హిమాలయప్రాంత నగరాల కేటగిరీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన పట్టణ స్థానిక సంస్థలకు రాష్ట్రపతి అవార్డులు ప్రదానం చేశారు. అర్హత ఉన్న విభాగాల్లో.. ఏ కేటగిరీలోనూ తెలంగాణ తొలి మూడు ర్యాంకులను దక్కించుకోలేకపోయింది.రాష్ట్రస్థాయి ఉత్తమ నగరాల్లో... తెలంగాణలో జీహెచ్ఎంసీ తొలిస్థానంలో నిలిచింది. పారిశుద్ధ్య నిర్వహణ,

ఇళ్ల నుంచి చెత్తసేకరణ, ఘనవ్యర్థాల నిర్వహణ, మురుగునీటి శుద్ధి, నగర పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం వంటి పది ప్రధాన అంశాల ఆధారంగా చేపట్టిన మూల్యాంకనంలో జీహెచ్ఎంసీ మెరుగైన ఫలితాలను సాధించింది. పారిశుద్ధ్యం విషయంలో మంథని, చేర్యాల మున్సిపాల్టీలకు మెంటార్‌గా వ్యవహరించి వాటి పనితీరును మెరుగుపరిచింది.

పరిశుభ్రత విషయంలో ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలి: రాష్ట్రపతి

ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మాట్లాడుతూ నగరాలను స్వచ్ఛంగా ఉంచే విషయంలో ప్రజల అభిప్రాయాలు తీసుకొని ముందుకుసాగాలని అధికారులకు పిలుపునిచ్చారు. “నా ప్రజాజీవిత ప్రస్థానం పంచాయతీలో స్వచ్ఛతా కార్యక్రమం ద్వారానే ప్రారంభమైంది. ఈ రంగంలో అందరూ గుర్తించదగ్గ మార్పు తీసుకురావాలంటే అధికారవ్యవస్థ ప్రజలతో కలిసి పనిచేయాలి. పారిశుద్ధ్య కార్మికుల క్షేత్రస్థాయి అనుభవాలనూ పరిగణనలోకి తీసుకొని ఆచరణలో పెట్టాలి” అని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాలూ సర్వేలు నిర్వహించాలి: మనోహర్‌లాల్

కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ మాట్లాడుతూ... స్వచ్ఛభారత్ మిషన్ ఫలితాలు మరింత వేగంగా అందుకోవాలంటే రాష్ట్ర ప్రభుత్వాలూ ఇదే విధంగా రాష్ట్రస్థాయిలో సర్వే నిర్వహించి మంచి పనితీరు కనబరిచిన మున్సిపాల్టీలకు అవార్డులు అందజేయాలని సూచించారు.

తల్లిదండ్రులను పట్టించుకోకుంటే ‘రూ.10 వేల కోత’కు రంగం సిద్ధం

-3 పేజ తరువాయి

తల్లిదండ్రులు సైతం విచారణ తేదీన హాజరు కావాలి. రాకుంటే వారికీ నోటీసు జారీచేస్తారు. రెండోసారి హాజరుకాకుంటే జిల్లా కలెక్టరు వారి దరఖాస్తును తిరస్కరిస్తారు. అయితే సరైన కారణం చూపితే రద్దుచేసిన దరఖాస్తు విచారణను తిరిగి ప్రారంభిస్తారు.

విచారణ అనంతరం.. జిల్లా అథారిటీ ఇచ్చిన ఆదేశాలను 60 రోజుల్లోగా ఆయా ప్రభుత్వ విభాగాలు అమలు చేయాలి. ఆర్డరు ఇచ్చిన తేదీ నుంచి ఉద్యోగి వేతనంలో 15 శాతం లేదా రూ.10 వేలు ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని దరఖాస్తు చేసిన తల్లిదండ్రుల ఖాతాలో ప్రతి నెలా జమ చేయాలని అథారిటీ ఆదేశిస్తుంది.

తల్లిదండ్రులకు ఒకరికన్నా ఎక్కువ సంతానం ఉండి, వారిలో మరొకరు ప్రభుత్వ ఉద్యోగి అయితే తొలుత నోటీసు అందుకున్న వ్యక్తి... అథారిటీకి తెలియజేయాలి. అప్పుడు ఇద్దరికీ నోటీసులు జారీ అవుతాయి. అథారిటీ జారీ చేసే ఆదేశాలను ఇద్దరూ పాటిస్తూ, పేర్కొన్న మొత్తాన్ని చెరిసగం భరించాలి.

ఈ అథారిటీలు, కమిషన్లకు సివిల్ కోర్టు అధికారాలు ఉంటాయి. అథారిటీ, కమిషన్ ఇచ్చిన ఆదేశాలను యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలి. లేకుంటే జరిమానాలు విధిస్తాయి. దరఖాస్తును జిల్లా అథారిటీ 60 రోజుల్లో పరిష్కరించకుంటే.. తల్లిదండ్రులు రాష్ట్ర కమిషన్‌లో అప్పీలు చేసుకోవచ్చు. అప్పీలు చేసిన 60 రోజుల్లోగా ఆ దరఖాస్తును కమిషన్ పరిష్కరిస్తుంది.

జిల్లా అథారిటీ ఇచ్చిన ఆదేశాలపైనా కమిషన్‌లో అప్పీలు చేసుకోవచ్చు. తల్లిదండ్రుల్లో ఒకరు చనిపోతే.. ఆయా ఆధారాలతో అథారిటీలో దరఖాస్తు చేస్తే.. బతికున్నవారికి ఆ వేతనం ప్రతి నెలా అందుతుంది.

ఈ ఆదేశాలు అమలవుతున్న సమయంలో ఎప్పుడైనా తల్లిదండ్రులు తమ దరఖాస్తును వెనక్కి తీసుకునే అవకాశాన్ని నిబంధనల్లో చేర్చారు. ఈ కేసులను ఆరు నెలలకోసారి వయోవృద్ధుల కమిషన్ చీఫ్ కమిషనర్ ఆధ్వర్యంలోని కమిటీ పర్యవేక్షిస్తుంది.

లంచం కేసులో నిజామాబాద్ మాజీ సీఐకి జైలు శిక్ష

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నిజామాబాద్ జిల్లా మాజీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ధరావత్ బాలాజీకి హైదరాబాద్‌లోని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ప్రత్యేక న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. ఆయనపై నమోదైన అవినీతి కేసులో నేరం రుజువు కావడంతో కోర్టు ఆయనను దోషిగా తేల్చింది. ఈ మేరకు ఎస్పీఈ, ఏసీబీ కేసుల రెండో అదనపు ప్రత్యేక న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా బుధవారం (నవంబర్ 11, 2026) తుది తీర్పును వెలువరించారు.ఈ కేసు విచారణలో భాగంగా ధరావత్ బాలాజీపై వచ్చిన అభియోగాలను, ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలను న్యాయస్థానం క్షుణ్ణంగా పరిశీలించింది. నిందితుడు అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్)-1988లోని సెక్షన్ 7, అలాగే సెక్షన్ 13(1)(డి) రెడ్ విత్ 13(2) నిబంధనల ప్రకారం నేరానికి పాల్పడినట్లు న్యాయమూర్తి నిర్ధారించారు.దీంతో ఈ రెండు అభియోగాల కింద బాలాజీకి ఒక్కో ఏడాది చొప్పున కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీటితో పాటు రూ.10,000 జరిమానా కూడా చెల్లించాలని ఆదేశించింది. అయితే, ఈ రెండు శిక్షలను ఏకకాలంలో (కాంకరెంట్‌గా) అనుభవించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.నిజామాబాద్ జిల్లాలో గతంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన ధరావత్ బాలాజీపై 2011లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. విధుల్లో భాగంగా అక్రమాలకు పాల్పడటం, లంచం డిమాండ్ చేయడం వంటి అంశాలపై అప్పట్లో ఏసీబీ అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి ప్రత్యేక న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు. సుదీర్ఘ కాలం పాటు కొనసాగిన న్యాయ ప్రక్రియ అనంతరం ప్రత్యేక కోర్టు ఈ కేసులో దోషికి శిక్ష ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

ఏపీలో మిగిలిన 23 పురపాలికల ఎన్నికల షెడ్యూల్ నేడు విడుదల

ఆంధ్రప్రదేశ్‌లో గతంలో వాయిదా పడిన 23 పట్టణ స్థానిక సంస్థలకు (యూఎల్‌బీ) ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. గురువారం (నవంబరు 12) మధ్యాహ్నం 12:30 గంటలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధికారికంగా ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. దీంతో రాష్ట్రంలోని పలు కీలక నగరాలు, పట్టణాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలు ఉండగా, వాటిలో 100 సంస్థలకు ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. మిగిలిన 4 కార్పొరేషన్లు, 15 మున్సిపాలిటీలు, 4 నగర పంచాయతీలకు సంబంధించి హైకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండటంతో అక్టోబర్ 14న విడుదల చేసిన సాధారణ నోటిఫికేషన్‌లో వీటికి చోటు దక్కలేదు. ప్రస్తుతం వీటికి సంబంధించిన న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవడం, వార్డుల పునర్విభజన మరియు రిజర్వేషన్ల ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేయడంతో ఎస్ఈసీ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించనుంది.

నాలుగు కార్పొరేషన్ల రిజర్వేషన్ల వివరాలు

ఎన్నికలు జరగనున్న నాలుగు ప్రధాన కార్పొరేషన్లలో మొత్తం 260 డివిజన్లు ఉన్నాయి. వీటిలో బీసీలకు 90, ఎస్సీలకు 35, ఎస్టీలకు 5, జనరల్ మహిళలకు 68, ఓపెన్ కేటగిరీకి 62 డివిజన్లు కేటాయించారు.


మేయర్ పదవుల రిజర్వేషన్లను పరిశీలిస్తే:


- శ్రీకాకుళం: బీసీ మహిళ (బీసీ జనరల్)
- కాకినాడ: బీసీ మహిళ
- రాజమహేంద్రవరం: ఎస్సీ (జనరల్)
- మంగళగిరి--తాడేపల్లి: ఎస్టీ

ఈ నాలుగు కార్పొరేషన్లతో పాటు మిగిలిన 19 పురపాలక సంస్థల పరిధిలో మొత్తం 749 వార్డులు ఉండగా, వాటిలో 174 వార్డులను ఓపెన్ కేటగిరీ కింద ఖరారు చేశారు.



మిక్కిలినేని మను చౌదరి.. మేడ్చల్ జిల్లా కలెక్టర్..





రంగారెడ్డి జిల్లా కలెక్టర్..

కలెక్టర్లపై హైకోర్టు కొరడా..!

- మొన్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆరు నెలల జైలు..
- తాజాగా ఇప్పుడు మేడ్చల్ కలెక్టర్‌ను కోర్టుకు హాజరు కావాలని ఆదేశాలు..!
- ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యంపై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం..!
- విచారణకు గైర్హాజరుపై అసంతృప్తి.. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌కు కీలక ఆదేశాలు..!

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 11:

జిల్లా కలెక్టర్ల వ్యవహారశైలి ఇప్పుడు హైకోర్టు ఆగ్రహానికి కారణమవుతోంది. మొన్నటికి మొన్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధించిన ఉదంతం మరువకముందే.. తాజాగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ వ్యవహారం కూడా హైకోర్టు వరకు చేరింది. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునే ప్రక్రియలో జిల్లా కలెక్టర్ వ్యవహరించిన తీరుపై న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారానికి సంబంధించి విచారణకు హాజరుకావాల్సి ఉన్నప్పటికీ కలెక్టర్ కోర్టుకు రాకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో కలెక్టర్‌ను కోర్టు ముందు హాజరుపరచాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌ను ఆదేశిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవైపు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు జైలు శిక్ష.. మరోవైపు మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను కోర్టుకు తీసుకురావాలంటూ ఆదేశాలు రావడం అధికార వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది.. ప్రభుత్వ భూములను పరిరక్షించడం, వాటిని చట్టబద్ధంగా స్వాధీనం చేసుకునే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం అధికారుల బాధ్యత.. అయితే ఈ వ్యవహారంలో కలెక్టర్ అనుసరించిన విధానంపై న్యాయస్థానం అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునే ప్రక్రియలో చోటుచేసుకున్న పరిణామాలు, అధికారుల వ్యవహారశైలిపై కోర్టు దృష్టి సారించింది.. ఈ నేపథ్యంలో విచారణకు కలెక్టర్ స్వయంగా హాజరుకావాల్సి ఉన్నప్పటికీ గైర్హాజరు కావడాన్ని న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో అధికారుల బాధ్యత ఎంత కీలకమో ఈ పరిణామం మరోసారి స్పష్టం చేస్తోంది..

కోర్టు ఆదేశాలపై నిర్లక్ష్యమా..?

న్యాయస్థానం విచారణకు పిలిచినప్పుడు సంబంధిత అధికారులు హాజరై తమ వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఈ కేసులో కలెక్టర్ హాజరు కాకపోవడంతో హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. అధికారుల బాధ్యతా రాహిత్యంపై తీవ్రంగా స్పందిస్తూ కలెక్టర్‌ను కోర్టుకు తీసుకురావాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. జిల్లా పరిపాలనలో అత్యున్నత స్థాయిలో ఉన్న కలెక్టర్ విషయంలోనే హైకోర్టు ఈ తరహా ఆదేశాలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు విచారణకు హాజరుకావాల్సిన బాధ్యతను విస్మరించడంపై కోర్టు తీవ్రంగా స్పందించడం అధికార యంత్రాంగానికి హెచ్చరికగా భావిస్తున్నారు..

అధికార వర్గాల్లో చర్చ..!

సాధారణ ప్రజల సమస్యల పరిష్కారం నుంచి ప్రభుత్వ భూముల పరిరక్షణ వరకు జిల్లా కలెక్టర్ కీలక బాధ్యతలు నిర్వహిస్తారు. అలాంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అధికారి కోర్టు విచారణకు హాజరు కాకపోవడం న్యాయస్థానం తీవ్రంగా స్పందించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధించిన నేపథ్యంలో, తాజాగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ విషయంలో హైకోర్టు తీసుకున్న చర్యలు అధికార వర్గాల్లో మరింత చర్చకు దారితీస్తున్నాయి. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయి..? కలెక్టర్ కోర్టుకు హాజరై ఎలాంటి వివరణ ఇవ్వనున్నారు..? ప్రభుత్వ భూముల స్వాధీన ప్రక్రియలో చోటుచేసుకున్న లోపాలపై ఎలాంటి స్పష్టత రానుంది..? అన్న అంశాలు ఆసక్తికరంగా మారాయి.

ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ సిద్ధం



హైదరాబాద్, నవంబర్ 11, పెన్ పవర్:

హైదరాబాద్ శివార్లలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన 'ఫ్యూచర్ సిటీ' మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. సింగపూర్‌కు చెందిన ప్రఖ్యాత సంస్థ 'డీపీ ఆర్కిటెక్ట్స్' అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ ప్రణాళికను రూపొందించింది. మొత్తం 1.80 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న ఈ నగరం మాస్టర్ ప్లాన్‌ను త్వరలో జరిగే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.పురపాలక శాఖ అధికారుల సమాచారం ప్రకారం, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) పరిధిలోని 7 మండలాలు, 71 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఈ ప్రణాళికను రూపొందించారు. నగరాల అస్తవ్యస్త విస్తరణకు అడ్డుకట్ట వేస్తూ, పర్యావరణ సమతుల్యతను కాపాడటం దీని ముఖ్య ఉద్దేశం. భూ వినియోగ ప్రణాళిక కింద వ్యవసాయ, నివాస, పారిశ్రామిక, వాణిజ్య, పర్యావరణ పరిరక్షణ ప్రాంతాలను స్పష్టంగా విభజించారు. పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తూనే ఉద్యోగుల నివాసాలు, విద్య, వైద్యం వంటి సామాజిక వసతులపై దృష్టి సారించారు. 2047 నాటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ ప్లాన్‌లో రవాణా సౌకర్యాలకు పెద్దపీట వేశారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారులను అనుసంధానించనున్నారు. పర్యావరణ అనుమతులపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో పిటిషన్ దాఖలు కావడంతో, చెరువులు, నాలాలు, అటవీ ప్రాంతాల పరిరక్షణకు ఈ ప్రణాళికలో స్పష్టమైన మార్గదర్శకాలు చేర్చారు.ఈ మాస్టర్ ప్లాన్‌లో వివిధ రంగాలకు ప్రత్యేక జోన్లను కేటాయించారు. ఇందులో లైఫ్ సైన్సెస్ హబ్‌కు 4,000 ఎకరాలు, నివాస ప్రాంతాలకు 2,477 ఎకరాలు, ఎలక్ట్రిక్ వాహనాలు-ఎనర్జీ పార్కులకు 1,976 ఎకరాలు కేటాయించారు. అలాగే హెల్త్ సిటీకి 594 ఎకరాలు, ఏఐ సిటీకి 403 ఎకరాలు, డేటా సెంటర్ హబ్‌కు 313 ఎకరాలు, ఎడ్యుకేషన్ హబ్‌కు 255 ఎకరాలు కేటాయించారు.మరోవైపు, మాస్టర్ ప్లాన్ సిద్ధమైన నేపథ్యంలో తమ భూములు ఏ జోన్ పరిధిలోకి వస్తాయోనన్న ఆందోళన రైతులు, భూ యజమానులు, రియల్ ఎస్టేట్ వర్గాల్లో నెలకొంది. రైతుల హక్కులు, భూసేకరణ, పరిహారం వంటి అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్‌కు దక్షిణంగా రంగారెడ్డి జిల్లాలో ఓఆర్ఆర్, శ్రీశైలం, నాగార్జునసాగర్ హైవేల మధ్య విస్తరించి ఉన్న ఈ నగరాన్ని 'నెట్-జీరో స్మార్ట్ సిటీ'గా అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం.

పట్టభద్రులను ఉద్యోగులుగా మార్చడమే లక్ష్యం.. దుండ్ర కుమారస్వామి

హైదరాబాద్ పెన్ పవర్: మెహిదీపట్నంలోని గుడిమల్కాపూర్ కింగ్స్ ప్యాలెస్‌లో నిరుద్యోగులు, పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం, జాబ్ మేళా--2026 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి పాల్గొని యువత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టభద్రులను ఉద్యోగులుగా మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, నియామకాల్లో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు పట్టభద్రులు హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి దుండ్ర కుమారస్వామి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన.. పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపిస్తానని హామీ ఇచ్చారు.

ఆటోమొబైల్, ఈవీ రంగాల్లో భారీ పెట్టుబడులే లక్ష్యంగా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం పాల్గొన్న మంత్రి పొన్నం

హైదరాబాద్ పెన్ పవర్: న్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026లో ఆటోమొబైల్, ఈవీ రంగాల్లో భారీ పెట్టుబడులే లక్ష్యంగా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం ప్రారంభం అయింది. సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ప్రారంభమైన ఆటోమొబైల్ ఉ ఎలక్ట్రిక్ వెహికల్స్ (జుఎ) రంగం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ
సమావేశంలో రవాణా శాఖ సెక్రెటరీ ఇలాంబర్తి, స్పెషల్ సెక్రెటరీ ఇండస్ట్రీస్ కృష్ణ ఆదిత్యా, నిఖిల్ చక్రవర్తి ఇండస్ట్రీస్ సెక్రెటరీ, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జెటీసి వెంకట రమణ , ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ కన్వీనర్‌గా పరిశ్రమల శాఖ డైరెక్టర్ జొజాద్ షేక్ తదితరులు పాల్గొన్నారు.
హైబ్రిడ్ విధానంలో జరుగుతున్న సమావేశానికి సుమారు 25 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులు హాజరు అయ్యారు.
ఏథర్, బాష్, జెడ్ఎఫ్, టాఫే, జియో బీపీ, ఏవీఎల్ తదితర ప్రముఖ సంస్థల ప్రతినిధుల పాలు పంచుకున్నారు. తెలంగాణలో ఆటోమొబైల్ తయారీ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, బ్యాటరీ టెక్నాలజీ, క్లీన్ మొబిలిటీ రంగాల్లో పెట్టుబడులపై చర్చ జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల అవకాశాలు, పరిశ్రమల విస్తరణపై పారిశ్రామికవేత్తలతో చర్చించారు.
గ్లోబల్ సమ్మిట్‌లో నిర్వహించే ఇన్వెస్ట్‌మెంట్ ఎక్స్‌పోలో ప్రముఖ ఆటోమొబైల్, ఈవీ కంపెనీల భాగస్వామ్యంపై చర్చ జరిగింది. పరిశ్రమలకు అవసరమైన విధానపరమైన అంశాలు, ప్రభుత్వ సహకారం, మౌలిక సదుపాయాల కల్పనపై పారిశ్రామికవేత్తల నుంచి సూచనల స్వీకరించారు. గ్లోబల్ సమ్మిట్‌లో ఆటోమొబైల్ ఉ ఈవీ రంగంపై ప్రత్యేక సెషన్ నిర్వహణకు కీలక అంశాల గుర్తించారు. పరిశ్రమలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో కొత్త పెట్టుబడులు, ఉద్యోగావకాశాల కల్పనకు కార్యాచరణ ప్రణాళికపై చర్చ జరిగింది.
తెలంగాణను దేశంలోనే ప్రముఖ ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వాహనాల పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.


కార్యక్రమాలకు చిన్నారెడ్డి దూరం...

వరంగల్, నవంబర్ 11, పెన్ పవర్: తెలంగాణ కాంగ్రెస్‌లో మరో సీనియర్ నేత వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీలో కీలక పదవులు నిర్వహించిన ఆయన.. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల తర్వాత మౌనం పాటిస్తుండటంతో అసలు ఏం జరుగుతోందనే చర్చ మొదలైంది. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి తరహాలో చిన్నారెడ్డి కూడా పార్టీకి దూరమయ్యే ఆలోచనలో ఉన్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.డాక్టర్ జి. చిన్నారెడ్డికి కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఉంది. 1985 నుంచి ఎన్నికల రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయనకు పార్టీ పలుమార్లు అవకాశాలు కల్పించింది. మొత్తం ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం ఇచ్చింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రిగా కూడా పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.
రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగానూ పనిచేశారు.పార్టీ అధిష్ఠానానికి సన్నిహితుడిగా గుర్తింపు పొందిన చిన్నారెడ్డి.. ఇటీవల వనపర్తి రాజకీయ పరిణామాల నేపథ్యంలో వార్తల్లో నిలిచారు. ప్రస్తుత ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, పార్టీ వ్యవహారాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందు వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అనంతరం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి ప్రభుత్వం తొలగించింది. దీంతో చిన్నారెడ్డి రాజకీయ ప్రస్థానంలో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి.ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించిన తర్వాత చిన్నారెడ్డి రాజకీయంగా మౌనం పాటిస్తున్నారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. హైదరాబాద్‌లోనూ, ఢిల్లీలోనూ పార్టీ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో ఆయన కనిపించడం లేదని నేతలు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం ఇప్పుడు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.ఇదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పార్టీతో విభేదాల నేపథ్యంలో తీసుకున్న రాజకీయ నిర్ణయాలు కూడా చర్చకు వస్తున్నాయి. చిన్నారెడ్డి కూడా అదే దారిలో పయనిస్తారా? పార్టీపై అసంతృప్తితోనే మౌనం వహిస్తున్నారా? లేక ప్రస్తుత పరిణామాలు సద్దుమణిగే వరకు వేచి చూస్తున్నారా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న చిన్నారెడ్డి భవిష్యత్ కార్యాచరణపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. పార్టీ నాయకత్వంతో మళ్లీ సఖ్యత కుదుర్చుకుంటారా? తిరిగి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారా? లేక తన రాజకీయ భవిష్యత్తుపై మరో నిర్ణయం తీసుకుంటారా? అన్నది చూడాలి. ప్రస్తుతానికి ఆయన మౌనం వెనుక ఉన్న కారణాలపై స్పష్టత లేదు. రానున్న రోజుల్లో చిన్నారెడ్డి వేసే రాజకీయ అడుగులే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పనున్నాయి.

ఆ రెండు పార్టీలు సైలెంట్

హైదరాబాద్, నవంబర్ 11, పెన్ పవర్:
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వైవాహిక జీవిత పరిణామాలపై అటు అధికార భాగస్వామి తెలుగుదేశం పార్టీ, ఇటు ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ తమ శ్రేణులకు కఠిన సంయమన మార్గదర్శకాలను జారీ చేశాయి. నాయకుల వ్యక్తిగత వ్యవహారాలను రాజకీయాల్లోకి లాగవద్దని, ఎలాంటి అనుచిత పోస్టులు పెట్టవద్దని ఆ రెండు పార్టీలు హెచ్చరించాయి. అయితే, క్షేత్రస్థాయిలో ప్రధాన పార్టీలు హుందాతనం ప్రదర్శిస్తుంటే.. జనసేన ముసుగులో ఉన్న కొందరు సోషల్ మీడియా ఔత్సాహికులు, అభిమానులు మాత్రం పరిస్థితిని అనవసరంగా రగిలిస్తూ వివాదాలను పెంచి పోషిస్తున్నారు.జనసేన పార్టీ సోషల్ మీడియా బలానికి, బలహీనతకు ప్రధాన కారణం అందులో అత్యధికులు సాధారణ సినీ అభిమానులే కావడం. వీరిలో చాలామందికి పార్టీ సంస్థాగత నియమావళి, రాజకీయ లక్ష్మణరేఖలపై ఎలాంటి స్పష్టమైన అవగాహన ఉండదు. అధికారిక పార్టీ గొడుగు కింద క్రమశిక్షణతో కాకుండా, వ్యక్తిగత ఖాతాల ద్వారా తాము పవన్ కల్యాణ్‌ను కాపాడుతున్నాం అనే భ్రమలో చేసే పోస్టులు చివరకు పార్టీకే తీవ్ర కీడు చేస్తున్నాయి. స్వయంగా
పవన్ కల్యాణ్ పీఆర్వో అధికారికంగా విడాకుల ప్రెస్ నోట్‌ను విడుదల చేసినప్పటికీ.. ఆ విషయాన్ని సైతం టీడీపీ వర్గాలే మీడియాకు లీక్ చేశాయంటూ మిత్రపక్షంపై బురదజల్లే పోస్టులు పెట్టడం వీరి రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం. మిత్రధర్మాన్ని విస్మరించి టీడీపీ శ్రేణులను బహిరంగంగా కించపరచడం, ప్రతి చిన్న అంశానికీ ప్రత్యర్థులతో పాటు మిత్రులనూ రెచ్చగొట్టడం వీరి ప్రధాన ధోరణిగా మారింది.ఈ గందరగోళంలో మరో ప్రమాదకరమైన కోణం కూడా దాగి ఉంది. జనసేన అభిమానుల రూపంలో చెలరేగిపోతున్న కొందరు ఖాతాదారులు వాస్తవానికి వైసీపీకి చెందిన కోవర్ట్స్ అన్న అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. టీడీపీ–జనసేన కూటమిని మానసికంగా, రాజకీయంగా చీల్చడమే లక్ష్యంగా పెట్టుకున్న కొందరు కేటుగాళ్లు.. తాము పవన్ భక్తులమని చెప్పుకుంటూ సోషల్ మీడియాలో టీడీపీ నాయకత్వంపై, చంద్రబాబుపై అత్యంత విషపూరిత ప్రచారం సాగిస్తున్నారు. పవన్ వ్యక్తిగత అంశాన్ని నెపంగా చూపి ఇరు పార్టీల కేడర్ మధ్య చిచ్చుపెట్టేందుకు ఇలాంటి ముసుగు ఖాతాలు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. ఈ కుట్రను గ్రహించలేని అమాయక జనసేన అభిమానులు కూడా ఆ ఉచ్చులో పడి కూటమి సమన్వయాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తుండటం పార్టీ సీనియర్లను ఆందోళనకు గురిచేస్తోంది.జనసేన అధిష్ఠానం, పార్టీ అధికారిక డిజిటల్ వింగ్ తక్షణమే కళ్లు తెరిచి దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అనివార్యత ఏర్పడింది. అసలైన కార్యకర్తలు ఎవరు, విధ్వంసకర ఫ్యాన్స్ ఎవరు, ప్రత్యర్థి పార్టీల నుంచి చొరబడిన కోవర్టులు ఎవరన్నది వడపోసి కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారిక వేదికల ద్వారా మిత్రపక్షాలపై తప్పుడు ఆరోపణలు చేసే ఖాతాలను బహిరంగంగా తిరస్కరించాలి. రాజకీయ పరిణతి లేకుండా సోషల్ మీడియాలో రెచ్చిపోతే అంతిమంగా నష్టపోయేది పవన్ కల్యాణ్ ఇమేజ్, కూటమి స్థిరత్వమేనన్న నిజాన్ని అభిమానులకు బోధించాల్సిన బాధ్యత జనసేన అగ్ర నాయకత్వంపై ఉంది. ఈ అనియంత్రిత శక్తులను ఇప్పటికైనా కట్టడి చేయకపోతే.. బయటి శత్రువుల కంటే అనుకూల శత్రువుల వల్లే జనసేనకు ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది.

ఒకే సమయంలో రెండు రాష్ట్రాల సమ్మిట్‌లు



హైదరాబాద్, నవంబర్ 11, పెన్ పవర్:
తెలుగు రాష్ట్రాల మధ్య పారిశ్రామిక , పెట్టుబడుల సాధనలో సరికొత్త పోటీ వాతావరణం నెలకొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు దాదాపు ఒకే సమయంలో మెగా పెట్టుబడుల సదస్సులు నిర్వహిస్తున్నాయి. తెలంగాణలోని రేవంత్ రెడ్డి సర్కారు హైదరాబాద్ వేదికగా నవంబర్ 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు భారత్ సమ్మిట్ నిర్వహిస్తుండగా.. అటు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నం వేదికగా ప్రతిష్టాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ను నిర్వహిస్తోంది. రెండు రాష్ట్రాల సదస్సుల పేర్లు, వేదికలు వేరైనా.. వాటి అంతిమ లక్ష్యం మాత్రం ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలను ఆకర్షించి, వేల కోట్ల రూపాయల పెట్టుబడులను ఒడిసిపట్టడమే.ఒకే సమయంలో రెండు భారీ సమ్మిట్‌లు జరగనుండటంతో సహజంగానే కార్పొరేట్ వర్గాల్లో, మీడియాలో పోలికలు మొదలయ్యాయి. ఏ సమ్మిట్‌కు ఎలాంటి గ్లోబల్ దిగ్గజాలు హాజరవుతున్నారు? ఏ రాష్ట్రానికి ఎన్ని లక్షల కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదురుతున్నాయి? అన్న విషయాలపై అంచనాలు సాగుతున్నాయి. హైదరాబాద్ సమ్మిట్‌కు అంతర్జాతీయ ప్రతినిధులతో పాటు జాతీయ స్థాయి కార్పొరేట్ నెట్‌వర్క్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఆహ్వానిస్తుండగా.. విశాఖ సదస్సుకు 59 దేశాల ప్రతినిధులు, 15 మంది విదేశీ మంత్రులు, భారత ఉపరాష్ట్రపతి, కేంద్ర వాణిజ్య మంత్రితో పాటు సుమారు 1,250 మందికి పైగా ప్రముఖులను రప్పించేలా ఏపీ ప్రభుత్వం భారీ నెట్‌వర్క్‌ను రంగంలోకి దించింది. పారిశ్రామికవేత్తలు సైతం హైదరాబాద్ నుంచి విశాఖకు, విశాఖ నుంచి హైదరాబాద్‌కు తమ ప్రతినిధులను సర్దుబాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ పరిణామాన్ని కేవలం ఆధిపత్య పోరాటంగా చూడటం కంటే.. ప్రాంతీయ ఆర్థిక వికాసానికి దారితీసే ఆరోగ్యకరమైన పోటీ గా భావించవచ్చు. ఒకప్పుడు చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌ను ఐటీ కేంద్రంగా నిలబెట్టినప్పుడు పోటీ లేని వాతావరణం ఉండేది. కానీ ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మించే సంకల్పంతో నవ్యాంధ్ర వేగంగా అడుగులు వేస్తుంటే.. దశాబ్దాలుగా ఉన్న మెట్రో నగర అనుకూలతను, ఫ్యూచర్ సిటీ కాన్సెప్ట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తోంది. తెలంగాణ గ్రీన్ ఫీల్డ్ భారత్ ఫ్యూచర్ సిటీ , ఏఐ, ఫార్మా రంగాల్లో పట్టు నిలుపుకోవాలని ప్రయత్నిస్తుంటే.. ఏపీ తన సుదీర్ఘ తీరప్రాంతం, పోర్టులు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ , సెమీకండక్టర్లు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులతో పోటీ పడుతోంది.పోటీ ఎంత బలంగా ఉంటే పెట్టుబడిదారులకు అంత మేలు జరుగుతుందన్నది మార్కెట్ సూత్రం. సింగిల్ విండో అనుమతులు, పారదర్శక పారిశ్రామిక రాయితీలు, మౌలిక వసతుల కల్పనలో ఏ రాష్ట్రం మెరుగైన ఆఫర్లు ఇస్తుందనే అంశాన్ని పరిశ్రమలు బేరీజు వేసుకుంటాయి. గతంలో కేవలం ఒకే నగరానికో లేదా ఒకే ప్రాంతానికో పరిమితమైన పరిశ్రమలు.. ఇప్పుడు హైదరాబాద్‌తో పాటు విశాఖ, అమరావతి, రాయలసీమ వంటి ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా విస్తరించే వెసులుబాటు కలుగుతుంది. రెండు ప్రభుత్వాల విధానాలలో పారదర్శకత పెరగడానికి, పరిపాలనా జాప్యాన్ని నివారించేందుకు ఈ ఆరోగ్యకరమైన పోటీ ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేస్తుంది. రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న ఈ పెట్టుబడుల సమరం అంతిమంగా తెలుగు సమాజానికి, ఉపాధి కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగ యువతకే ప్రయోజనం చేకూర్చనుంది.

కాంగ్రెస్‌కు పరీక్షగా ఉద్యోగుల అసంతృప్తి!


హైదరాబాద్, నవంబర్ 11, పెన్ పవర్:
తెలంగాణలో రెండో వేతన సవరణ సంఘంనివేదిక అమలు ఆలస్యం అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా మరో సవాల్‌గా మారుతోంది. ఇప్పటికే పీఆర్సీ కోసం ఎదురుచూస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు.. ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై పడే అవకాశాలున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. తెలంగాణలో రెండో పీఆర్సీ ప్రక్రియ ప్రారంభమై మూడేళ్లు దాటుతున్నా.. ఇప్పటివరకు నివేదికపై స్పష్టత రాకపోవడం ఉద్యోగుల్లో ఆందోళనకు కారణమవుతోంది. 2023 అక్టోబర్‌లో రెండో పీఆర్సీని ఏర్పాటు చేయగా.. ఆరు నెలల్లో సిఫార్సులు అందించాల్సి ఉంది. అయితే గడువు దాటినా నివేదిక పెండింగ్‌లోనే ఉండటంతో ఉద్యోగ సంఘాలు పలుమార్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి.ఈ ఏడాది మే 2న ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. పీఆర్సీ నివేదికను త్వరగా అందించాలని అధికారుల కమిటీని ఆదేశించినట్లు ప్రకటించారు. నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 18లోగా నివేదిక సమర్పించాలని ప్రభుత్వం గడువు విధించగా.. నవంబర్ నాటికీ ఉద్యోగుల ప్రధాన డిమాండ్ పరిష్కారం కాలేదనే అసంతృప్తి కొనసాగుతోంది.పీఆర్సీ నివేదికను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు,
పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (డిమాండ్ చేస్తోంది. 51 శాతం ఫిట్‌మెంట్‌తో 2023 జులై 1 నుంచి కొత్త వేతనాలను అమలు చేయాలని కోరుతోంది.దీంతో పాటు పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రస్తుతం నెలకు కేటాయిస్తున్న రూ. 1,000 కోట్లను రూ. 2,000 కోట్లకు పెంచాలని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపై కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోంది. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల విలువ రూ. 10 వేల కోట్లకు పైగా ఉందని జేఏసీ నేతలు చెబుతున్నారు.నవంబర్ 6న హైదరాబాద్‌లోని టీజీవో భవన్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. దీపావళి తర్వాత ఆందోళన కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించినట్లు సమాచారం.
ప్రస్తుతం ఈ ఉద్యోగుల అసంతృప్తి కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా కీలకంగా మారుతోంది. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్, వరంగల్–ఖమ్మం–నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఓటర్లుగా ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో నాలుగు లక్షలకు పైగా ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది గ్రాడ్యుయేట్లుగా ఉన్నారని జేఏసీ నేతలు పేర్కొంటున్నారు. వీరిలో గణనీయమైన సంఖ్యలో ఇప్పటికే ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారని చెబుతున్నారు.పీఆర్సీ అమలు సహా
తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓటు వేయడమే కాకుండా.. వ్యక్తిగత స్థాయిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని కొందరు ఉద్యోగులు హెచ్చరిస్తున్నట్లు సమాచారంఅధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే పీఆర్సీ, పెండింగ్ డీఏలు, బిల్లుల చెల్లింపులు, పెన్షన్ విధానం వంటి అంశాలు ఇంకా చర్చల్లోనే ఉండటంతో ఉద్యోగ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, పీఆర్సీ నివేదిక అందిన తర్వాత తీసుకోవాల్సిన నిర్ణయాలు ప్రభుత్వానికి కీలకంగా మారాయి. ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపుతుందా? లేక ఉద్యోగుల ఆందోళన మరింత తీవ్రమవుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. ఉద్యోగుల అసంతృప్తిని ప్రభుత్వం ఎలా చల్లారుస్తుందన్నది రాబోయే రోజుల్లో చూడాలి

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక

నాచారంలో రేపు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి

కాప్రా పెన్ పవర్,నవంబర్ 11:విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్ పి డీసీల్) ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు హబ్సిగూడ ఆపరేషన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కె. శ్రీనివాస్ తెలిపారు.



నాచారం 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఇండస్ట్రియల్ ఏరియా బిల్డింగ్‌లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ సమావేశం జరుగనుంది. ఈ కార్యక్రమానికి వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్) చైర్‌పర్సన్‌తో పాటు మెంబర్ టెక్నికల్, మెంబర్ ఫైనాన్స్, మెంబర్ కస్యూమర్ అఫైర్స్ అధికారులు హాజరుకానున్నారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలు, విద్యుత్ బిల్లుల్లో హెచ్చుతగ్గులు, ఇతర సమస్యలపై వినియోగదారులు నేరుగా ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని అధికారులు సూచించారు.ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కె. శ్రీనివాస్ కోరారు

మాట నిలబెట్టుకున్న మానవతామూర్తి..

బీడీఎస్ విద్యార్థినికి అండగా భూక్యా సురేష్ నాయక్

తల్లిని కోల్పోయి చదువుకు దూరమవుతున్న విద్యార్థినికి రెండేళ్లుగా ఆర్థిక భరోసా.. చివరి ఏడాది ఫీజు అందజేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వైనం

ఖమ్మం, పెన్ పవర్, నవంబర్ 11 :
మంచితనానికి మారుపేరు.. మాట ఇస్తే మడమ తిప్పని మనసున్న మనిషి భూక్యా సురేష్ నాయక్. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే తన బాధ్యతగా భావించే ఆయన మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. రెండేళ్ల క్రితం తల్లిని కోల్పోయిన శ్రీదివ్య అనే విద్యార్థిని బీడీఎస్ ఉన్నత విద్యను అభ్యసిస్తున్న సమయంలో ఆర్థిక ఇబ్బందులతో కళాశాల ఫీజు చెల్లించలేక చదువు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం భూక్యా సురేష్ నాయక్ దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించారు. విద్యార్థినితో మాట్లాడుతూ నీ చదువు ఆగకూడదని, విద్యాదానం మహాదానమని భరోసా ఇచ్చారు. ఆనాడు దయాకర్ అన్న, ఏఎంసీ మద్దులపల్లి హరినాథ్ సమక్షంలో ఫీజు చెల్లించి ఆమె చదువుకు అండగా నిలిచారు. నాడు ఇచ్చిన మాటను నేడు కూడా నిలబెట్టుకుంటూ చివరి సంవత్సరం ఫీజు మొత్తాన్ని విద్యార్థిని సోదరుడికి అందజేశారు. రెండేళ్లుగా ఒక విద్యార్థిని భవిష్యత్తు కోసం బాధ్యత తీసుకొని, ఆమె ఉన్నత చదువు పూర్తయ్యే వరకు తోడుగా నిలవడం ఆయన గొప్ప మనసుకు నిదర్శనం.వయసులో చిన్నవారైనా ఆలోచనల్లో ఎంతో ఉన్నతంగా ఉండే భూక్యా సురేష్ నాయక్ లాంటి వ్యక్తులు సమాజానికి ఆదర్శం. మనిషి సంపాదించే ఆస్తులకంటే నలుగురి జీవితాల్లో



వెలుగులు నింపడం ద్వారా సంపాదించే గౌరవమే గొప్పది. అలాంటి మంచి పనులే మనిషిని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలబెడతాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభావం

మహబూబ్ నగర్, నవంబర్ 11, పెన్ పవర్:
తెలంగాణలో త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి అగ్నిపరీక్షగా మారే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చూపుతున్న అలసత్వం.. ముఖ్యంగా రెండో వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) అమలుపై నెలకొన్న ప్రతిష్టంభన ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. తమ చిరకాల డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓటు వేయడమే కాకుండా, స్వయంగా ప్రచారం చేసి గుణపాఠం చెబుతామని ఉద్యోగ సంఘాలు హెచ్చరిస్తుండటం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోందిప్రస్తుతం మహబూబ్‌నగర్–రంగారెడ్డి– హైదరాబాద్, అలాగే వరంగల్– ఖమ్మం– నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఎన్నికల వేడి మొదలైంది. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలోని ఆరు జిల్లాల్లో కలిపి సుమారు నాలుగు లక్షల మందికి పైగా ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ సిబ్బంది గ్రాడ్యుయేట్లుగా ఉన్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. పట్టభద్రుల స్థానాల్లో ఫలితాలను తారుమారు చేయగల సంఖ్యాబలం వీరికి ఉండటంతో, ఉద్యోగ వర్గాల అసహనం నేరుగా ఫలితాలపై ప్రభావం చూపే ప్రమాదం ఏర్పడింది.నవంబర్ 6న నాంపల్లిలోని టీజీవో భవన్‌లో తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్‌పర్సన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. మూడేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా జూలై 1, 2023 నుంచి వర్తించేలా 51శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీ నివేదికను తక్షణమే విడుదల చేసి అమలు చేయాలని జేఏసీ పట్టుబడుతోంది. గతంలో జూన్ 2 నాటికి కమిషన్ నుంచి నివేదిక తెప్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదని నేతలు గుర్తుచేశారు. అలాగే ఉద్యోగులకు రావాల్సిన వివిధ బిల్లుల బకాయిలు ప్రస్తుతం రూ. 10,000 కోట్ల మార్కును దాటాయి. వీటిని క్లియర్ చేయడానికి ప్రభుత్వం ప్రతినెలా కేటాయిస్తున్న మొత్తాన్ని ప్రస్తుత రూ. 1,000 కోట్ల నుంచి రూ. 2,000 కోట్లకు పెంచాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.మరోవైపు.. పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ అంశాన్ని పరిశీలించేందుకు సంయుక్త కమిటీ వేస్తామని, పీఆర్సీ నివేదిక తెప్పిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చి రెండు నెలలు దాటినా ఇప్పటివరకు కార్యాచరణ శూన్యమని మండిపడ్డారు. ప్రభుత్వం తెచ్చిన కొత్త ఎంప్లాయీ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను జేఏసీ స్వాగతించినప్పటికీ, అది కాగితాలకే పరిమితం కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలన్నింటికీ వర్తింపజేయాలని, నెట్‌వర్క్ ఆసుపత్రులు తప్పనిసరిగా నగదు రహిత సేవలు అందించేలా కఠిన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు.జేఏసీ అగ్రనాయకత్వం ప్రభుత్వంతో సంప్రదింపులకు ఇంకా మొగ్గు చూపుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉద్యోగుల్లో తీవ్ర అసహనం నెలకొంది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను దాటవేస్తున్నారన్న ఆగ్రహం వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే దీపావళి పండుగ ముగియగానే ఉద్యమ కార్యాచరణను ఖరారు చేయాలని జేఏసీ నిర్ణయించింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ సమీపిస్తున్న వేళ, ప్రభుత్వం నుంచి స్పష్టమైన కాలపరిమితితో కూడిన హామీ రాకపోతే పోరుబాట తప్పదని ఉద్యోగ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. పెండింగ్ బిల్లుల విడుదల, 51శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు దిశగా ప్రభుత్వం త్వరితగతిన అడుగులు వేయకపోతే, గ్రాడ్యుయేట్ ఓటర్ల ఆగ్రహం అధికార పార్టీకి రాజకీయంగా భారీ నష్టాన్ని చేకూర్చే అవకాశాలు కనిపిస్తున్నాయి

దళిత, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయాలి

డిసెంబర్ 6న అంబేద్కర్ వర్ధంతికి దేశవ్యాప్తంగా ఉచిత రైలు సౌకర్యం కల్పించాలి

పేద దళిత కుటుంబాలకు పీఎంజీపీ పథకం అందించాలి.. లేకుంటే ఛలో ఢిల్లీ



కాప్రా, పెన్ పవర్, నవంబర్ 11: కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో దళిత జన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జ యాదగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా దళిత, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.డిసెంబర్ 6న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ముంబైలోని ఆయన సమాధి వద్ద నివాళులర్పించేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఉచిత రైలు ప్రయాణ సౌకర్యం కల్పించాలని జాతీయ అంబేద్కర్ అవార్డు గ్రహీత బత్తుల చంద్రమౌళి కోరారు.అలాగే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుపేద దళిత కుటుంబాలకు పీఎంజీపీ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించాలని, బ్యాంకుల నుంచి రుణాలు పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించి, ఎలాంటి అనవసర జాప్యం లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రామ్‌దాస్ అథవాలే ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.అర్హులైన దళిత కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ జాతీయ నాయకులు బత్తుల చంద్రమౌళి, బొజ్జ యాదగిరి, శ్రీనివాసరాజు, బీసీ సంఘం నాయకుడు కుమార్ గౌడ్, దళిత నాయకులు ఈ. యాదగిరి, బి. రాకేష్, ఈ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు.. అభివృద్ధి పనులకు శ్రీకారం

23వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇంటికి, రోడ్డు పనులకు శంకుస్థాపన

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: తుంబూరు దయాకర్ రెడ్డి



ఖమ్మం, పెన్ పవర్, నవంబర్ 11: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బుధవారం 23వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి, రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకుబత్తిని అనిత ముఖ్య అతిథులుగా పాల్గొని పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు, రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, 23వ వార్డు అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కథనం హైలెట్స్

పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ ఇళ్లతో భరోసా.

ఏదులాపురం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శ్రీకారం.

23వ డివిజన్‌లో ఇంటి నిర్మాణం, రోడ్డు పనులకు శంకుస్థాపన.

అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న ప్రజా ప్రభుత్వం.

చిన్న సూచన: మంత్రి పొంగులేటి స్వయంగా పాల్గొనకపోతే, ఆయన పేరుతో నేరుగా వ్యాఖ్యలు ఇచ్చినట్లు కాకుండా క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడినట్లుగా వార్తలో పేర్కొనడం మంచిది.

తల్లంపాడులో నూతన కూరగాయల సంత ప్రారంభం

గ్రామ ప్రజలు, పరిసర గ్రామాల ప్రజలు సంతను సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ కుమ్మరి అంబేద్కర్



ఖమ్మం రూరల్, పెన్ పవర్, నవంబర్ 11: ఖమ్మం రూరల్ మండల పరిధిలోని తల్లంపాడు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కూరగాయల సంతను బుధవారం గ్రామ సర్పంచ్ కుమ్మరి అంబేద్కర్, ఉపసర్పంచ్ గుడిబోయిన అరవింద్‌లు ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కుమ్మరి అంబేద్కర్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కూరగాయల సంతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు గ్రామస్థులు నిత్యావసర కూరగాయల కొనుగోలు కోసం ఖమ్మం పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు గ్రామంలోనే సంత ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ సంత తల్లంపాడు గ్రామంతో పాటు పొన్నెకల్లు, నరసింహపురం, గోపాలరావుపేట, మునిగేపల్లి, ఎడవల్లి తదితర పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సంత అభివృద్ధికి సహకరించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శేఖర్, నవీన్, తిరుపయ్య, విజయ్, గోపి, సీపీఎం నాయకులు యామిని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

40 ఏళ్ల నిరీక్షణకు తెర

నాచారం ఎస్సీ శ్మశానవాటికకు మహర్దశ

పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.1.76 కోట్ల నిధుల మంజూరు

పనుల ప్రారంభానికి అధికారుల పరిశీలన





కాంగ్రెస్ పార్టీ నాయకుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కాప్రా, పెన్ పవర్, నవంబర్ 11: నాచారం డివిజన్ పరిధిలోని ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధికి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. గత నాలుగు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని శ్మశానవాటిక సమస్యకు పరిష్కారం చూపే దిశగా రూ.1.76 కోట్ల నిధులు మంజూరు కావడంతో స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వాల హయాం నుంచి శ్మశానవాటిక అభివృద్ధి, మరమ్మతుల కోసం స్థానికులు పలుమార్లు ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఈ విషయాన్ని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సమస్య తీవ్రతను ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, శ్మశానవాటిక అభివృద్ధి, మరమ్మతుల కోసం రూ.1.76 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించారు.ఈ నేపథ్యంలో త్వరలో ప్రారంభం కానున్న అభివృద్ధి పనులకు సంబంధించి నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతలకంటి రాజు ఆధ్వర్యంలో బుధవారం సంబంధిత అధికారులు శ్మశానవాటికను సందర్శించారు. డీఈ సాయి పృథ్వీ, ఏఈ సూరజ్ దేశాయ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు విజయ్, రామ్ క్షేత్రస్థాయిలో పర్యటించి శ్మశానవాటిక ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మరమ్మతులకు సంబంధించిన అంశాలను సమీక్షించి తదుపరి చర్యలపై చర్చించారు.ఈ పరిశీలనలో శ్మశానవాటిక కమిటీ సభ్యులు ఎర్పుల నర్సింహ, అయ్యగారి రమేష్, ఎర్పుల శ్రీనివాస్, అయ్యగారి శ్రీకాంత్, ఎర్పుల చిన్న, అయ్యగారి హరీష్, అయ్యగారి పవన్, ఎర్పుల సుజాత తదితరులు పాల్గొన్నారు.
నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారానికి చొరవ చూపి నిధుల మంజూరుకు కృషి చేసిన మందుముల పరమేశ్వర్ రెడ్డికి నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతలకంటి రాజు కృతజ్ఞతలు తెలిపారు. నాచారం డివిజన్ ఎస్సీ సంఘాల సభ్యులు, శ్మశానవాటిక కమిటీ సభ్యులు,

శివ తత్వాన్ని విశ్వవ్యాప్తం చేస్తాం: ముద్దగౌని సతీష్ కుమార్ గౌడ్





భవిష్యత్తులో వేలాది మందితో శివ మాలధారణలు

ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక మాలధారణ

నేటి నుంచి ఆలయ ఆవరణలో నిత్యాన్నదానం

ఎల్బీనగర్, పెన్ పవర్, నవంబర్ 11:శివ తత్వాన్ని విశ్వవ్యాప్తంగా తెలియజెప్పేందుకు తమవంతు కృషి చేస్తున్నామని శ్రీ మల్లికార్జున భక్త సమాజం రాష్ట్ర అధ్యక్షులు, సాహెబ్ నగర్ శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ ముద్దగౌని సతీష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా శ్రీ మల్లికార్జున భక్త సమాజం ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గం సాహెబ్ నగర్ లోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ముద్దగౌని సతీష్ కుమార్ గౌడ్ గురుస్వామి శివ మాలధారణ చేసి సుమారు 103 మంది స్వాములకు మాలలు వేశారు. అనంతరం దేవాలయంలో శివుడికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ గౌడ్ గురుస్వామి మాట్లాడుతూ 16 ఏళ్లుగా శివ మాలధారణ చేసి మండల కాలం పాటు దీక్షలు చేస్తున్నామని తెలిపారు. మాలధారణ చేసిన వందలాది మంది స్వాములకు దేవాలయ ప్రాంగణంలో ప్రతియేడు నిత్యాన్నదానాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన అన్నారు. ఈ సంవత్సరం కూడా ప్రతినిత్యం వందలాది మంది స్వాములకు నిత్యాన్నదానాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తమతోపాటు మండల కాలం పాటు దీక్షలు పూర్తయిన తరువాత స్వాములకు దేవాలయ ప్రాంగణంలో ఇరుముడులు కట్టించి వాహనాల్లో శ్రీశైలం పుణ్యక్షేత్రానికి రెండు బస్సులలో తరలివెళ్లి తన సొంత ఖర్చులతో ఉచితంగా స్వామివారి స్పర్శ దర్శనంతో పాటు వసతిని కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. శివ మాలధారణ మండలం కాలం, అర్ధ మండలం కాలం పాటు వేసుకోవచ్చునని ఆయన తెలిపారు. దీంతోపాటు శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధికి తనవంతు చర్యలు తీసుకుంటున్నానని అన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు తుమ్మలపల్లి స్వప్నారెడ్డిచే శివ మాలధారణ చేయించారు.

తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు

కార్తీకమాసం ప్రారంభం కావడంతో సాహెబ్ నగర్, వనస్థలిపురం, హయత్ నగర్ పరిసర ప్రాంతాల నుండి వందలాది మంది భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి శివయ్యకు వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా దేవాలయ చైర్మన్ ముద్దగౌని సతీష్ కుమార్ గౌడ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అర్చకులు, సిబ్బందితో పాటు వందలాది మంది శివ స్వాములు, గురుస్వాములు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





రోడ్డు ప్రమాదంలో ఇంజం నాగేశ్వరరావు మృతి.. కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

పెద్దకర్మ కార్యక్రమానికి హాజరై నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

ఖమ్మం, పెన్ పవర్, నవంబర్ 11: ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన ఇంజం నాగేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం గ్రామంలో విషాదాన్ని నింపింది. ఆయన మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డా. బి. చంద్రావతి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో బుధవారం పండితాపురం గ్రామంలో నిర్వహించిన నాగేశ్వరరావు పెద్దకర్మ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే డా. బి. చంద్రావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.అనంతరం కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. కుటుంబానికి కలిగిన తీరని లోటు పట్ల సానుభూతి వ్యక్తం చేస్తూ, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. నాగేశ్వరరావు మృతి పట్ల మరోసారి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.



బాబు విజనరీ కారు...జగన్ ప్రజా నేత కాలేరు !



కొత్త పార్టీ పీఆర్పీ ప్రారంభించిన విజయసాయిరెడ్డి సీఎం చంద్రబాబు, వైఎస్ జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఇద్దరికీ నాయకత్వ లక్షణాలు, ప్రజలతో భావోద్వేగ అనుబంధం లేవని వ్యాఖ్యానించారు. తమ పార్టీ ఎవరికీ బీ టీమ్ కాదని స్పష్టం చేస్తూ, యువతకు 66 శాతం సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అవును కొత్త పార్టీ పెట్టారు, కొత్త ఉత్సాహం కూడా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చూపించారు. ఏపీలో రెండు ప్రధాన పార్టీల అధినేతలను విమర్శించకపోతే ఆయన పార్టీ ఎలా ముందుకు వెళ్తుంది. తమ పార్టీ ఆల్టర్నేషన్ అని ఎలా జనాలకు చెప్పుకోగలరు. అందుకే ఆయన పార్టీ పుట్టిన చోటు నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబుని విపక్ష నేత వైఎస్ జగన్ ని గట్టిగానే విమర్శించారు. ఒక విధంగా ఇద్దరి మీద తన ప్రసంగంలో విరుచుకుపడ్డారు. ఈ ఇద్దరు నేతల నాయకత్వం మీద వారి పని తీరు మీద కూడా విజయసాయిరెడ్డి తనదైన శైలిలో విశ్లేషించారు.

ఇద్దరూ ఇద్దరే అంటూ :

ముఖ్యమంత్రి చంద్రబాబు తనను విజనరీ అని చెప్పుకుంటారని కానీ ఆయన అది కానే కాదని విజయసాయిరెడ్డి అన్నారు. అలాగే జగన్ ప్రజా నాయకుడిని అని డప్పు కొట్టుకుంటారు కానీ ఆయన ఎప్పటికీ కాలేరని కూడా విజయసాయిరెడ్డి ఫైర్ అయ్యారు. అసలు ఈ ఇద్దరు నాయకులకూ నాయకత్వ లక్షణాలు లేవు అని విజయసాయిరెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ప్రజా నాయకుడు ఎలా ఉండకూడదో ఈ ఇద్దరిని చూస్తే అర్థం అవుతుందని అన్నారు. నాయకుడు అంటే ప్రజల బాధలను తెలుసుకునే వారు అని ఆయన చెప్పారు. జనాలతో ఎమోషనల్ కనెక్టివిటీ ఉండాలి కానీ బాబు జగన్ లలో అది శూన్యం అని విజయసాయిరెడ్డి తేల్చేశారు. నాయకత్వ లక్షణాలతో పాటు ఏదీ లేకున్నా అన్నీ ఉన్నట్లు ప్రచారం చేసుకోవడంలో బాబు జగన్ ఇద్దరూ దిట్టలని విజయసాయిరెడ్డి గట్టిగానే విమర్శించారు.

పీఆర్పీ బీ టీం కాదు :

పీఆర్పీ అన్నది తాను ప్రజల కోసం సొంతంగా ఏర్పాటు చేసిన పార్టీగా విజయసాయి రెడ్డి చెప్పారు. అది ఏ పార్టీకీ బీ టీం కానే కాదని అన్నారు. ఈ విషయంలో తాను దేవుడిపై ప్రమాణం చేస్తున్నానని కూడా విజయసాయిరెడ్డి చెప్పారు. తాను పెట్టిన పార్టీ ప్రజల కోసం వారి శ్రేయస్సు కోసం మాత్రమే అని ఆయన అంటున్నారు. అయితే విజయసాయిరెడ్డి పార్టీ రంగు కాషాయంగా ఉంది. అందులో ధర్మ చక్రం మధ్యలో ఉంది. దాంతో బీజేపీ కాషాయాన్ని ఈ పార్టీ జెండాను పోలిక పెట్టి చూస్తున్నారు. అందుకే విజయసాయిరెడ్డి వివరణ ఇచ్చారు అని అంటున్నారు. ఇక విజయసాయిరెడ్డి బీజేపీని జనసేనను విమర్శించకపోవడం మీద కూడా చర్చ సాగుతోంది. ఈ కారణంగా కూడా ఆయన పార్టీ బీ టీం కాదని చెప్పాల్సి వచ్చింది అని కూడా అంటున్నారు.

యువతకు 66 శాతం :

ఇక విజయసాయిరెడ్డి తన పార్టీలో యువతకు ఏకంగా 66 శాతం సీట్లు ఇస్తామని ప్రకటించారు. అలాగే కుల, మతాలకు అతీతంగా మా పార్టీలో అందరికీ చోటు ఉంటుందని స్పష్టం చేశారు. స్వచ్ఛంగా రాజకీయాలు చేయాలనుకునే వారికి పీఆర్పీ ఒక వేదిక అన్నారు. ఇక పార్టీ జెండాలు ఎన్నికల వేళ పట్టుకోవడానికో కటౌట్ లు కట్టడానికో యువత లేదని వారిని చట్టసభల్లో కూర్చోపెట్టి ప్రజల తరుపున మాట్లాడటానికి యువతను పీఆర్పీ తయారు చేస్తుంది అని విజయసాయిరెడ్డి చెప్పుకొచ్చారు.

విజయసాయిరెడ్డి వెంట నందమూరి తారకరత్న భార్య

విజయసాయిరెడ్డి కొత్త పార్టీ పీఆర్పీ ఆవిర్భావ కార్యక్రమానికి నందమూరి తారకరత్న భార్య అలేఖ్యరెడ్డి హాజరుకావడం చర్చనీయాంశమైంది. విజయసాయిరెడ్డికి ఆమె వరుసకు కూతురు కావడంతో కుటుంబ అనుబంధంతోనే వచ్చారా? లేక రాజకీయాల్లోకి అడుగుపెట్టే ఆలోచన ఉందా? అనే ఆసక్తి నెలకొంది. అయితే ఆమె రాజకీయ పాత్రపై స్పష్టత లేదు.

విజయసాయిరెడ్డి పార్టీ ప్రకటించడం తెలుగునాట ఓ సంచలనమైంది. ఏపీలో ఇన్నాళ్లు కులాల వారీగా విడిపోయిన పార్టీలకు విజయసాయిరెడ్డి పార్టీతో మరో కాంపిటీషన్ ఎదురైనట్టైంది. ఏపీ రాజకీయాల్లో తాను మార్పు తెస్తానని.. యువత, జెన్ జెడ్, బడుగు బలహీన వర్గాల ఏజెండాతో ముందుకెళ్లనున్నట్లు విజయసాయిరెడ్డి ప్రకటించారు. 'పరివర్తన రాజనీతి పార్టీ' (పీఆర్పీ) అంటూ ప్రకటించి తన కొత్త రాజకీయ ప్రస్తానాన్ని ప్రారంభించారు. పనిలో పనిగా తాను గతంలో పనిచేసిన వైసీపీ నుంచి నేతలందరినీ తన పార్టీలోకి ఆహ్వానించేసి ఓ రకంగా తన మాజీ బాస్ వైఎస్ జగన్ కు షాకిచ్చారనే చెప్పాలి.

రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యామ్నాయ పార్టీగా ఎదుగుతానని ప్రకటించిన విజయసాయిరెడ్డి తన పార్టీకి వెన్నుదన్నుగా కొత్త తరానికి బదులు మిగతా పార్టీల్లోని నేతలనే ముందుగా ఆహ్వానించడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే వైసీపీ అసంతృప్తులకు భారీ ఆఫర్ ఇచ్చిన విజయసాయిరెడ్డి టీడీపీని వదులుతాడా? అన్న చర్చ కూడా సాగింది. కానీ టీడీపీకి సన్నిహితంగా ఉన్న కుటుంబాలను కూడా తన వైపు లాగడంలో విజయవంతమయ్యాడని తాజాగా ఆ వేదుకకు హాజరైన వారిని బట్టి మనకు అర్థమవుతోంది.

విజయసాయిరెడ్డి కొత్త పార్టీ ఆవిర్భావ కార్యక్రమంలో నందమూరి తారకరత్న సతీమణి అలేఖ్య రెడ్డి ప్రత్యక్షం కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. విజయసాయిరెడ్డి కొత్త పార్టీ ప్రకటన కంటే అలేఖ్యరెడ్డి హాజరు వెనుక కారణాలపైనే ఇప్పుడు ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. ఆమె విజయసాయిరెడ్డి పార్టీలో ఏదైనా కీలక పాత్ర పోషించబోతున్నారా? లేక బంధువు అయిన విజయసాయిరెడ్డి వెంట ఈ కార్యక్రమానికి హాజరయ్యారా? విజయ సాయిరెడ్డికి వెన్నుదన్నుగా నిలుస్తారా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.అయితే తారకరత్న పక్కా టీడీపీ వారసుడే.. ఎన్టీఆర్ కుటుంబంలోని సభ్యుడే. నారా లోకేష్ పాదయాత్రకు వెళ్లి అనూహ్యంగా గుండెపోటుతో మరణించారు. టీడీపీతో మమేకమైన తారకరత్న చనిపోయే వరకూ ఆ పార్టీ కోసమే పనిచేశారు. అయితే ఆయన భార్య ఇప్పుడు విజయసాయిరెడ్డి వెంట నడవడం హాట్ టాపిక్ గా మారింది. ఇది టీడీపీకి షాక్ అనే వారు ఉన్నారు. కానీ బాబాయి కావడంతోనే విజయసాయిరెడ్డి వెంట అలేఖ వెళ్లారని తెలుస్తోంది.

అయితే అలేఖ్య రెడ్డికి వరుసకు విజయసాయిరెడ్డి బాబాయి అవుతాడు. కుటుంబ పరంగా వీరిద్దరి మధ్య అనుబంధం ఉంది. తారకరత్నకు పిల్లనిచ్చి చేయడంలో విజయసాయిరెడ్డి అప్పట్లో కీలక పాత్ర పోషించారు. తారకరత్న పిల్లలతోనూ కొన్ని వీడియోలను ఇటీవల విజయసాయిరెడ్డి చేశారు. అప్పుడప్పుడూ కుటుంబ కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.

తారకరత్న మరణం తర్వాత తన కూతురు వరుస అయిన అలేఖ్యరెడ్డికి అండగా విజయసాయిరెడ్డి నిలబడ్డారని సమాచారం. తారకరత్న మరణం తర్వాత అలేఖ్యరెడ్డికి విజయసాయిరెడ్డి కుటుంబం అండగా ఉంటోంది. ఇప్పుడు ఆయన పార్టీ పెట్టడంతో అందులో అలేఖ్యరెడ్డి పాల్గొనడం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

బాబాయి కొత్త పార్టీ వేళ కుటుంబ సభ్యురాలిగా అలేఖ్య హాజరయ్యారా? లేక భవిష్యత్తులో ఆమె కూడా రాజకీయాల్లోకి అడుగుపెట్టే ఆలోచన చేస్తున్నారా? అన్నది ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది.

ఏపీలో రాజకీయ శూన్యత ...టీడీపీ వైసీపీ సంగతేంటి ?

ఏపీలో రాజకీయ శూన్యత ఉందన్న మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై చర్చ జరుగుతోంది. టీడీపీ, వైసీపీకి బలమైన ఓటు బ్యాంకు ఉండగా, జనసేన కూడా గణనీయమైన మద్దతు కలిగి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త పార్టీకి ఎంతవరకు ఆదరణ లభిస్తుందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయాల్లో శూన్యత ఎప్పుడూ ఉండదు, సముద్రం ఇంకిపోదు, మహానదులు ఎండిపోవు అన్నట్లుగా రాజకీయాల్లో ఎపుడూ ఖాళీ అన్నది అసలు ఉండదు, అయితే పాత వాటిని తోసుకుంటూ కొత్తగా వచ్చే పార్టీలు ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి చూసే క్రమంలో అవి తగ్గిపోవడమో వెనకబడడమో బలహీన పడడమో జరుగుతుంది. మరి అంతలా బలంగా దూసుకుని వచ్చే పార్టీలు వస్తేనే తప్ప పాత వాటికి కనుమరుగు ఉండదు. కానీ ఏపీలో రాజకీయ శూన్యత ఉందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అంటున్నారు. అందుకే కొత్త పార్టీ పెట్టాను అని ఆయన చెబుతున్నారు. ఇది నిజమేనా అంటే దానికి సంబంధించిన లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉంది.


బలమైన ఓటు షేర్ :

ఏపీలో రెండు ప్రధాన పార్టీలుగా టీడీపీ వైసీపీ ఉన్న సంగతి విధితమే. ఈ రెండు పార్టీలకు చెరి నలభై శాతం ఓటు షేర్ ఉంది అని అంటారు. అంటే 80 శాతం రాజకీయ మైదానాన్ని ఈ పార్టీలే ఆక్రమించాయన్న మాట. ఇక ఆ మిగిలిన ఇరవై శాతంలో జనసేన పది శాతం అయినా ఓటు షేర్ తో ఉందని అంటారు. బీజేపీ కాంగ్రెస్ వామపక్షాలు తదితర పార్టీలు అయిదు శాతం ఓటు షేర్ తీసుకున్న ఒక్క అయిదారు శాతం మాత్రమే ఖాళీ ఉంది. మరి దానినే రాజకీయ శూన్యతగా భావించాలా అన్నది ఒక చర్చగా ముందుకు వస్తోంది.

విభజించబడ్డారు :

ఇక ఏపీలో పార్టీలకు కార్యకర్తలే కాదు జనాలు కూడా విభజించబడ్డారు అని గత కొన్ని ఎన్నికల నుంచి సాగుతున్న ఓటింగ్ విధానం కానీ పరిణామాలు కానీ చెబుతున్నాయి. ఒక విధంగా తమిళనాడు తరహాలో అన్న మాట. అక్కడ డీఎంకే అన్నా డీఎంకే ఓటర్లు సెపరేట్ గా ఉంటారు. వారు ఆ పార్టీలకే ఓటు వేస్తారు.

అయితే



సునామీగా దూసుకొచ్చిన టీవీకే సంప్రదాయ పార్టీల ఓట్లను తాను తీసుకోవడంతో బలమైన ఆల్టర్నేషన్ గా మారింది. ముందే చెప్పినట్లు కొత్త పార్టీ తుఫాన్ గా వస్తేనే తప్ప వట వృక్షాలు గా మారి వేళ్ళూనుకుపోయిన పాత పార్టీలు కొట్టుకుపోయే పరిస్థితి ఉండదు, మరి ఆ స్థాయిలో కొత్త పార్టీగా విజయసాయి రెడ్డి పెట్టిన పీఆర్పీ ఉందా అన్నదే చర్చగా ఉంది.

ఏపీకి అవసరమా :

ఇక దేశంలో ఏ రాష్ట్రంలో అయినా రాజకీయ ప్రయోగాలు అంతగా విజయవంతం కావడం లేదు. దానికి కారణం జనంలో ఉన్న ఒక రకమైన భావన. సర్దుకుపోయే తత్వం, కొత్త మీద కొంత కలవరం, పాతతోనే పోతే ఉండే సౌఖ్యం. ఇలా చాలా విషయాలు ఉన్నాయి. మరీ బాగా లేదు, తెగించాల్సిందే అన్న నాడే జనాలు ఆల్టర్నేషన్ వైపు చూసిన సందర్భాలు ఉన్నాయి.

అందుకే దేశంలో కాంగ్రెస్ ఆరు దశాబ్దాల పాటు ఏలింది. ఉమ్మడి ఏపీలో కూడా మూడున్నర దశాబ్దాల పాటు పాలించింది. ఇక విభజన ఏపీ విషయానికి వస్తే జనం మూడ్ కొత్త పార్టీలు కొత్త రాజకీయం వైపు ఉందా అన్నది కీలకమైన ప్రశ్న. ఎందుకంటే విభజనతో ఏపీ దారుణంగా నష్టపోయింది అన్నది అంతా గుర్తు పెట్టుకోవాల్సి ఉంది.

మరో అర్ధ శతాబ్దం :

ఏపీ ఒక రూపునకు రావాలీ అంటే మరో అర్ధ శతాబ్దం పడుతుందని కూడా విశ్లేషణలు ఉన్నాయి. అలాంటి చోట తడవకో పార్టీని తెచ్చి నూతన ప్రయోగాలు జనాలు చేస్తారా అన్నది కూడా ఆలోచించాల్సిన విషయమే అంటున్నారు. ఏపీలో టీడీపీ కూటమి చెబుతున్నది చూస్తే మరో మూడు ఎన్నికల వరకూ తామే గెలిస్తేనే ఏపీ గాడిలో పడుతుంది అని. మరో వైపు వైసీపీ చూస్తే అధికారం కోసం కాచుకుని ఉంది. ఈ రెండు పార్టీలు అధికారం అందుకుని అనుభవం గడించి ఉన్నాయి. అలాంటి చోట కొత్త ప్రయోగంగా వచ్చిన పార్టీలు ఏ మేరకు సక్సెస్ అవుతాయన్నది చూడాల్సి ఉంది. ఇక విజయసాయిరెడ్డి చెబుతున్నట్లుగా రెండు కులాలు రెండు కుటుంబాలు అన్నది కూడా బలమైన రాజకీయానికి దారి తీసినవి అన్నది చూడాలి. కులాల సమీకరణతో సాగే ఏపీ రాజకీయాలలో కుటుంబాలకు ఉన్న రాజకీయ ఇమేజ్ తో ఓటు బ్యాంకు స్థిరీకరించుకున్న క్రమంలో రెండు పార్టీలను పక్కన పెట్టాలీ అంటే జనాలు ఎలా స్పందిస్తారు అన్నది ఆలోచించాలి. ఇక రాజకీయ శూన్యత ఏపీలో ఉందా అంటే లేదు అన్నదే జవాబుగా కనిపిస్తోంది.

కొత్త కోవిడ్ వేరియంట్ PJ.2.1.. మళ్లీ కరోనా భయం అవసరమా?



జూ.2.1 అనే కొత్త కోవిడ్ వేరియంట్ కెనడా, అమెరికా, సింగపూర్ సహా పలు దేశాల్లో గుర్తించారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, అలసట వంటి సాధారణ కరోనా లక్షణాలే కనిపించవచ్చు. ఈ వేరియంట్ గత రకాల కంటే ప్రమాదకరమని ఆధారాలు లేవని, భారత్‌లోనూ విస్తృత వ్యాప్తి నిర్ధారణ కాలేదని కథనం పేర్కొంది.కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించిన విషయం తెలిసిందే. ఇప్పటికీ ఈ వైరస్ పూర్తిగా కనుమరుగవ్వలేదు. ఎప్పటికప్పుడు కొత్త వేరియంట్ల రూపంలో బయటపడుతోంది. తాజాగాజూ.2.1 అనే కొత్త కోవిడ్ వేరియంట్ పలు దేశాల్లో గుర్తించడం చర్చనీయాంశంగా మారింది. దీంతో మళ్లీ కరోనా కేసులు పెరుగుతాయా? అనే ఆందోళన మొదలైంది.

అసలు PJ.2.1 అంటే ఏమిటి?

జూ.2.1 అనేది కరోనా వైరస్‌లో వచ్చిన కొత్త మార్పులతో ఏర్పడిన ఉపరకం. ఇది జీవీ.1 వేరియంట్ కుటుంబానికి చెందినది. వైరస్ మన శరీరంలోకి ప్రవేశించడానికి ఉపయోగపడే స్పైక్ ప్రోటీన్‌లో కొన్ని మార్పులు ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ల ద్వారా ఏర్పడిన యాంటీబాడీలు ఈ వేరియంట్‌ను ఎదుర్కొనే సామర్థ్యం కలిగి ఉన్నట్లు ప్రాథమిక పరీక్షల్లో వెల్లడైంది.

ఏయే దేశాల్లో గుర్తించారు?

2026 మే 2న కెనడాలోని ఒంటారియోలో తొలిసారిగా ఈ వేరియంట్‌ను గుర్తించారు. ఆ తర్వాత అమెరికా, సింగపూర్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇజ్రాయెల్, ఫ్రాన్స్, స్పెయిన్ వంటి దేశాల్లోనూ బయటపడింది. కెనడాలో దీని వ్యాప్తి క్రమంగా పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

లక్షణాలు ఎలా ఉంటాయి?

ఈ కొత్త వేరియంట్‌కు ప్రత్యేకమైన లక్షణాలు ఉన్నట్లు ఇప్పటివరకు గుర్తించలేదు. సాధారణ కరోనా లక్షణాలైన జ్వరం, దగ్గు, గొంతునొప్పి, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, అలసట వంటివి కనిపించవచ్చు. కొందరిలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కూడా ఉండవచ్చు.

భారత్‌కు ముప్పు ఉందా?

PJ.2.1 వేరియంట్ గతంలో వచ్చిన కరోనా రకాల కంటే ప్రమాదకరమని, మరణాలు పెంచుతుందని ఇప్పటివరకు ఆధారాలు లేవు. భారత్‌లో కూడా ఈ వేరియంట్ విస్తృతంగా వ్యాపిస్తున్నట్లు నిర్ధారణ కాలేదు. కాబట్టి ఇప్పుడే భయపడాల్సిన అవసరం లేదు. అయితే వృద్ధులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. కరోనా లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. కొత్త వేరియంట్లపై ఆరోగ్య శాఖలు నిఘా కొనసాగించడం అవసరం.

జగన్ గ్రౌండ్ లోకి దిగాల్సిందే... లేకపోతే కష్టమేనట !



2024 ఓటమి తర్వాత జగన్ తాడేపల్లి, బెంగళూరుకే పరిమితమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పార్టీ సర్వేలతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా తెలుసుకోవాలని సూచనలు వస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై జిల్లాల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి నేతలు, కార్యకర్తలతో సమీక్షలు నిర్వహించాలని, 2029 ఎన్నికలే లక్ష్యంగా పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.వైసీపీ అధినేత జగన్ 2024 ఓటమి తరువాత ఎక్కువగా తాడేపల్లి టూ బెంగళూరు గానే షటిల్ సర్వీస్ చేస్తున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. ఆయన పార్టీ వారితో అపుడపుడు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అది కూడా నియోజకవర్గాల ఇంచార్జిలు, రీజనల్ కోఆర్డినేటర్లు, పార్టీ సీనియర్ నేతలు ఇలా పై స్థాయిలో మాత్రమే. వారితో మాట్లాడుతూ పార్టీని వారి ద్వారానే నడిపిస్తున్నారు. ఇక అక్కడ వచ్చే ఇన్ పుట్స్ అన్నవి అధినాయకత్వానికి అందుతున్నాయి. కానీ అవే నిజం అనుకుంటే గ్రౌండ్ లెవెల్ లో ఏమి జరుగుతుందో ఫీడ్ బ్యాక్ ఎలా తెలుస్తుంది అన్నది చర్చగా ఉంది. అయితే వైసీపీ అధినాయకత్వం అక్కడితో ఆగకుండా తమ సొంత సర్వేలు చేయిస్తోంది. అలా ఏపీలో ఓటమి మీద చేయించిన సర్వేలలో చాలా విషయాలు తెలిసాయని అంటున్నారు.

ఎంతవరకూ చూడాలి :ఇక ఈ సర్వే నివేదికలు అన్నవి కూడా కొంత పరిమితితో కూడి ఉంటాయని అంటున్నారు. నిజానికి వైసీపీకి సర్వేలు పెద్దగా అచ్చి రాలేదని అంటారు. 2019 ఎన్నికల వేళ తప్పించి 2024 సర్వేలు పూర్తిగా బోల్తా కొట్టించాయి. అంతకు ముందు పలు సందర్భాల్లో చేయించిన సర్వేలు కూడా పూర్తి వాస్తవాలను అధినాయకత్వం ముందు ఉంచలేకపోయాయని గుర్తు చేస్తున్నారు. మరి ఈ సర్వేలు అయితే ఒక మాదిరి పిక్చర్ ని మాత్రమే ఇస్తాయని తెలుస్తోంది. దాంతో పూర్తి విషయలు తెలియాలి అంటే ఏమి చేయాలి అన్నది ప్రశ్న ఉంది. దానికి జవాబు కూడా ఉంది. అదే జగన్ గ్రౌండ్ లెవెల్ లోకి డైరెక్ట్ గా దిగాల్సిందే అని అంటున్నారు.

సమీక్షలు అక్కడే :వైసీపీ అధినాయకత్వం స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల మధింపుని చేస్తోంది అని అంటున్నారు. అయితే అవి తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో కాకుండా జిల్లాలకు వెళ్ళి క్షేత్ర స్థాయిలో ద్వితీయ తృతీయ శ్రేణి నాయకులతో పాటు క్యాడర్ తో కలిసి కూర్చుని చర్చిస్తేనే పూర్తి సమాచారం పక్కాగా వస్తుంది అని అంటున్నారు. లేకపోతే మాత్రం ఎప్పటికీ వైసీపీకి ఈ ఇబ్బందులు తప్పవని కూడా అంటున్నారు. ఏపీలో వైసీపీకి గత అనుభవాలు ఉన్నాయి, ఓటములు ఉన్నాయి. కానీ 2024 తరువాత పరిస్థితులు వేరు అని అంటున్నారు.

బలంగా కూటమి :రాజకీయాల్లో కూటములు బలంగా ఉన్నపుడు సహజంగానే మొగ్గు ఆ వైపు ఉంటుంది. ఏపీలో కొన్ని రీజియన్లలో అదే జరుగుతోంది అని అంటున్నారు. ఇక కొన్ని చోట్ల తీసుకుంటే వైసీపీకి బలం ఉండి కూడా ఎత్తిగిల్లలేకపోతోంది. మరి కొన్ని చోట్ల అన్నీ ఉండి వర్గ పోరుతో సతమతం అవుతోంది. ఇలా వివిధ కారణాలు ఉన్నాయి. ఇక ఇన్ చార్జిలలో అనేక మంది గడచిన రెండున్నరేళ్లుగా గ్రౌండ్ లెవెల్ లో పనిచేయడం లేదని చెబుతున్నారు. అలాగే క్యాడర్ కి లీడర్లకు మధ్య గ్యాప్ అలాగే ఉందని అంటున్నారు. అది స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగడం వల్లనే చేదు ఫలితాలు వచాయని చెబుతున్నారు.

సంస్థాగతంగా :అదే విధంగా చూస్తే సంస్థాగతంగా వైసీపీ నిర్మాణంలో కూడా మరమ్మతులు చేయాల్సి ఉందని అంటున్నారు. ప్రస్తుతం అనేక చోట్ల ఇన్ చార్జిలను అధినాయకత్వం ప్రకటించింది. వారిని పై నుంచి దిగుమతి చేసింది. దాంతో క్యాడర్ మెచ్చిన నాయకులు కొన్ని చోట్ల ఉంటే మరి కొన్ని చోట్ల లేరని అంటున్నారు. అలా కాకుండా క్యాడర్ తో చర్చించి అందరికీ అందుబాటులో ఉండే వారిని ఇకనైనా ఏర్పాటు చేసుకుంటే 2029 ఎన్నికల నాటికి వైసీపీ బలపడుతుందని అంటున్నారు. పార్టీ కోసం గట్టిగా పనిచేసేవారికి ఛాన్స్ ఇవ్వాలని అలాగే 2029 ఎన్నికల్లో వారికే చాన్స్ ఇస్తామని భరోసా కల్పించాలని అపుడే వారు గట్టిగా పనిచేస్తారు అని అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

తిరుమలకు వెళ్లే వారికి అలెర్ట్.. ఈ జాగ్రత్తలు తీసుకోకుంటే



తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. అయితే గత మూడు రోజులతో పోలిస్తే నేడు కొద్దిగా భక్తుల రద్దీ తగ్గినప్పటికీ దర్శనానికి ఎక్కువ సమయం పడుతుంది. అయితే భక్తులు కంపార్ట్ మెంట్లను దాటి నేడు కూడా బయట వరకూ వేచి ఉన్నారు. దీంతో క్యూ లైన్ లో ఉన్నవారికి అవసరమైన తాగునీరు, అన్న ప్రసాదాన్ని, మజ్జిగ, పాలు వంటి వాటిని శ్రీవారి సేవకులు పంపిణీ చేస్తున్నారు. క్యూ లైన్లలో గంటల తరబడి నిరీక్షణ చేసే వారికి ఎంత మాత్రం ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అలాగే క్యూ లైన్ లలో ఉన్న భక్తులు సంయమనం పాటిస్తూ సిబ్బందికి సహకరించాలని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు కోరుతున్నారు.

పన్నెండు గంటల సమయం...

తిరుమలకు వచ్చే భక్తుల కోసం నిత్యం అన్ని సేవలు అందుబాటులో ఉంచారు. అలాగే ఎస్.ఎస్.డి టోకెన్లను కూడా జారీ చేస్తున్నారు. రోజువారి జారీ చేసే టోకెన్లతో భక్తులు సులువుగా దర్శనాలు చేసుకుంటున్నారు. ఇక శీఘ్రదర్శనం టోకెన్లను ముందుగానే కొనుగోలు చేసిన భక్తులతో పాటు కాలినడకన వచ్చే భక్తుల సంఖ్య కూడా గతంలో కంటే పెరగడంతో వారికి సౌకర్యాలను కల్పిస్తున్నారు. అయితే వసతి గృహాలు లభ్యం కావడం కోసం కొంత వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వచ్చే ఏడాది జనవరి నెల వరకూ ఇదే తరహా భక్తుల రద్దీ ఉంటుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అంచనా వేసి అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

నారాయణగిరి షెడ్ల వరకూ...

నేడు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్ మెంట్లలో భక్తులు నిండిపోయి బయట వరకూ వేచి చూస్తున్నారు. బయట నారాయణ షెడ్ల వరకూ భక్తుల క్యూ లైన్ కొనసాగుతుంది. సర్వదర్శనం క్యూ లైన్ లోని ఉదయం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనం పన్నెండు గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. శీఘ్రదర్శనం టోకెన్లున్న భక్తులకు శ్రీవారి దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది. నిన్న తిరుమల శ్రీవారిని 78,085 మంది భక్తులు దర్శించుకున్నారు. నిన్న తలనీలాలు సమర్పించిన భక్తుల సంఖ్య 26,232 మందిగా ఉంది. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.93 కోట్లు సమకూరిందని అధికారులు తెలిపారు.

ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో రేవంత్ అలెర్ట్ అయ్యారా?



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ నేతల పట్ల అసంతృప్తితో ఉన్నారు. కొందరు ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరు పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఇక దాదాపు ఎన్నికల సమయం దగ్గరపడినట్లే. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వచ్చే ఏడాది దాదాపు మూడేళ్ల కాలం పూర్తయింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించడంలో కాంగ్రెస్ నేతలు విఫలమయ్యారన్న అభిప్రాయానికి వచ్చారు. ఇది ప్రజల్లో వ్యతిరేకతను పెంచే విధంగా ఉందని గ్రహించిన రేవంత్ ఇక ఊరుకుంటే లాభం లేదన్న అభిప్రాయానికి వచ్చారు.స్వయంగా తాను రంగంలోకి దిగాలని నిర్ణయించుకున్నారు. అందుకే ఇక జిల్లాల బాట పట్టాలని నిర్ణయించుకున్నారు. పాత ఉమ్మడి జిల్లా కేంద్రాలలో బహిరంగ సభలను ఏర్పాటు చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించాలని కూడా రేవంత్ రెడ్డి నిర్ణయించారు.

నేతలకు దిశానిర్దేశం...

అందుకే వచ్చే సంక్రాంతి తర్వాత జిల్లాల్లో పర్యటిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సంక్రాంతి పండుగ తర్వాత 'ప్రజాబలం' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల పర్యటన చేపట్టనున్నట్లు ప్రకటించారు. కొడంగల్ నియోజకవర్గ పర్యటన ముగింపు సందర్భంగా లగచర్లలో జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. సంక్రాంతి తర్వాత రాష్ట్రం నలుమూలలా పర్యటిస్తూ, ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజలు మరియు రైతులతో నేరుగా మమేకమవుతామని ముఖ్యమంత్రి తెలిపారు. తాను రంగంలోకి దిగి ప్రస్తుతం అధికార పార్టీపై ఉన్న ప్రజా వ్యతిరేకతను తొలగించాలని రేవంత్ నిర్ణయించారు. అప్పుడే ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అలెర్ట్ అవుతారని భావించారు. ఈ పర్యటనల్లో రేవంత్ రెడ్డి ఆ జిల్లా స్థానిక నాయకులతో కూడా సమావేశమై వారికి రానున్న ఎన్నికల సంబంధించి దిశానిర్దేశం చేయనున్నారు. ఇచ్చిన హామీల్లో కొన్నింటిని ఎందుకు అమలు చేయలేకపోయామో కూడా ప్రజలకు అర్థమయ్యేలా వివరించి వారి మెప్పు పొందేలా వ్యవహరించాలని రేవంత్ నాయకులను ఆదేశించనున్నారు.

రాజకీయ సునామి మరోసారి...

ఈ యాత్ర ద్వారా రాష్ట్రంలో 'ప్రజాబలం'తో ఒక రాజకీయ సునామీ సృష్టించేందుకు రేవంత్ రెడ్డి సిద్ధమవుతున్నారు. ఆ సునామీలో బీఆర్ఎస్, బీజేపీపార్టీలు కొట్టుకుపోతాయని, మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని రేవంత్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. రానున్న కాలంలో తమ ప్రభుత్వం నిలిచిపోయిన హామీలను కూడా అమలు చేస్తామని సభల్లో చెప్పి ప్రజలను ఒప్పించి, మెప్పించేందుకు రేవంత్ రెడ్డి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం వర్షాపాతం తగ్గడం వల్ల నెలకొన్న ఎల్‌నినో మరియు నీటి ఎద్దడి పరిస్థితుల్లో రైతులకు అండగా నిలబడటమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ క్షేత్రస్థాయిలో ఉండి రైతులకు అవగాహన కల్పిస్తారని వివరించారు. యాసంగిలో నీరు ఎక్కువగా అవసరమయ్యే వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలు, కూరగాయలు సాగు చేయాలని ఆయన రైతులకు సూచించనున్నారు. రాష్ట్రంలో బియ్యం నిల్వలకు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. అలాగే 2028 డిసెంబర్ నాటికి కొడంగల్ నియోజకవర్గానికి కృష్ణా జలాలను అందిస్తామని హామీ ఇచ్చారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మరియు రాష్ట్ర రాజకీయ సమీకరణాల నేపథ్యంలో, సీఎం రేవంత్ రెడ్డి చేపట్టనున్న ఈ 'ప్రజాబలం' జిల్లాల బాట తెలంగాణ రాజకీయాల్లో వేడిని పెంచనుంది.

ఏ రాశివారికి లాభం..? ఎవరికి కష్టం?



దినఫలాలు చూసుకోవడం కొందరికి హాబీ. మరికొందరికి నమ్మకం. రోజు వారీ రాశిఫలాలు చూసుకున్న తర్వాత మాత్రమే తమ దినచర్యను ప్రారంభించే వారు అనేక మంది ఉన్నారు. ఈరోజు ఏ రాశివారికి లాభం? ఎవరికి నష్టం? అని తెలుసుకోవాలనుందా?మేషం : బంధు మిత్రులతో అకారణ కలహాలు కలుగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. మాతృ వర్గ బంధువుల మాటలు మానసికంగా బాధిస్తాయి. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి కావు. వ్యాపారాలలో వ్యయ ప్రయాసలు అధికమవుతాయి.

వృషభం : గృహమున సంతోషకర వాతావరణం ఉంటుంది. సమాజంలో ప్రముఖుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. వ్యాపారాలలో పురోగతి సాధిస్తారు. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. ఆర్థికంగా కొంత మేలైన సౌకర్యాలుంటాయి. చిన్ననాటి మిత్రులతో ఉన్న మనస్పర్ధలు తొలగుతాయి.

మిథునం : సంతాన విద్యా విషయాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో నిరుత్సాహం తప్పదు. వ్యాపార ఉద్యోగాలలో ఒడిదుడుకులు ఉంటాయి. ఆర్థిక వ్యవహారాలు అంతంత మాత్రంగా ఉంటాయి. సన్నిహితులతో ఒక వ్యవహారంలో మనస్పర్ధలు కలుగుతాయి.

కర్కాటకం : బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. దీర్ఘకాలిక వివాదాలు పరిష్కారమవుతాయి. వృత్తి, ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఇంటాబయట సమస్యలు తెలివిగా పరిష్కరించుకుంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి.

సింహం : నూతన ఋణ ప్రయత్నాలు ఫలించవు. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. సకాలంలో పనులు పూర్తికాక చికాకులు పెరుగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవరోధాలు ఉంటాయి. సన్నిహితులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

కన్య : అన్ని రంగాల వారికి అనుకూల పరిస్థితులుంటాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వృత్తి ఉద్యోగాలలో మీ విలువ మరింత పెరుగుతుంది. ఆప్తుల నుండి విలువైన సమాచారం అందుతుంది. వ్యాపారములలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు.

తుల : వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. చేపట్టిన పనులలో ఆశించిన పురోగతి సాధిస్తారు. విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు లభిస్తాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. దూరప్రాంత బంధువుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి.

వృశ్చికం : ముఖ్యమైన పనులలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఇంటా బయట ఊహించని సమస్యలు ఎదురవుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. దైవ కార్యక్రమాలలో పాల్గొనడం మంచిది. నూతన ఋణయత్నాలు నిదానంగా సాగుతాయి.

ధనస్సు :

మిత్రులతో అకారణ కలహాలు కలుగుతాయి. ముఖ్యమైన పనులలో జాప్యం కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో ఇతరుల విషయాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. ఆర్థిక పరిస్థితి కొంత నిరుత్సాహపరుస్తుంది. వృత్తి వ్యాపారాలలో వ్యయ ప్రయాసలు అధికమౌతాయి.

మకరం : సంఘంలో విశేషమైన గౌరవమర్యాదలు పొందుతారు. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలు అందుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు మరింత సానుకూలంగా సాగుతాయి.

కుంభం : ధన వ్యవహారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ముఖ్యమైన

పనులు వాయిదా వేయుట మంచిది. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరిగి మానసిక సమస్యలు కలుగుతాయి. వ్యాపార వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. దూర ప్రయాణాలలో జాగ్రత్త వహించాలి.

మీనం : నిరుద్యోగుల కష్టం ఫలించదు. నూతన కార్యక్రమాలు ప్రారంభించకపోవడం మంచిది. సంతాన అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తికాక ఒత్తిడి పెరుగుతుంది. కుటుంబ సభ్యుల మాటలు కొంత నిరాశ కలిగిస్తాయి. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి.

ఆ ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో ఇబ్బందే.. బాబు సంకేతాలివే



: స్థానిక సంస్థల ఎన్నికలపై చంద్రబాబు కొందరి ఎమ్మెల్యేలపై అసంతృప్తితో ఉన్నారు. ఆయన మంత్రి వర్గం సమావేశంలో చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. ప్రజలు కూటమి ప్రభుత్వం వైపునకు మొగ్గు చూపుతున్నప్పటికీ కొందరి కూటమి నేతల వైఖరి కారణంగానే ఓటమి పాలయ్యామని చంద్రబాబు అనడం చూస్తే రానున్న ఎన్నికల్లో ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమికి బాధ్యులైన ఎమ్మెల్యేలకు టిక్కెట్లు దక్కే అవకాశం కనిపించడం లేదు. మరొకవైపు రెబల్స్ గా పోటీ చేసి తిరిగి తమ పార్టీ వైపు తిరిగి రావాలని భావించే వారికి కూడా చంద్రబాబు స్పష్టమైన సంకేతాలు పంపారు. కూటమి ఆదేశాలను ధిక్కరించి నామినేషన్లు వేసి గెలిచినా వారిని పార్టీలోకి చేర్చుకోబోమని తెలిపారు. దీన్ని బట్టి చంద్రబాబు ఎంత సీరియస్ గా ఉన్నారో చెప్పకనే తెలుస్తోంది.

సంతృప్తి వ్యక్తం చేసినా...

ఇటీవల మీడియా సమావేశం ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన కూటమి ఘన విజయంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, అనంతపురం మేయర్ ఎన్నిక ఓటమి మరియు కొన్ని ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేస్తూ లోతుగా సమీక్షిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమికి 58.90 శాతం ఓట్లు వచ్చాయని, పట్టణ ప్రాంతాల్లో 94 శాతం స్ట్రైక్ రేట్‌తో 9 పట్టణ స్థానిక సంస్థలు కూటమికే దక్కాయని చంద్రబాబు పేర్కొన్నారు.రెండున్నరేళ్ల అభివృద్ధి, సంక్షేమ పాలనకు ప్రజలు ఇచ్చిన గౌరవంగా ఈ ఫలితాలను తెలిపారు. అయినా తాము ఆశించినట్లుగా ఫలితాలు రాలేదని చంద్రబాబు భావిస్తున్నారు. విపక్ష వైసీపీకి కొంత అనుకూల వాతావరణం ఏర్పడిందన్న భావన కలగడానికి స్థానిక ఎమ్మెల్యేలే కారణమని చంద్రబాబు అభిప్రాయపడుతున్నారు. గన్నవరం తో పాటు మరికొన్ని కీలక నియోజకవర్గాల్లో పార్టీ ఓటమికి గల కారణాలను కూడా చంద్రబాబు తెలుసుకుంటున్నారు.

అసంతృప్తికి గల కారణాలివే...

రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభంజనం వీచినప్పటికీ, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికలో వైఎస్సార్సీపీ అభ్యర్థి 5,981 ఓట్ల మెజారిటీతో గెలవడంపై చంద్రబాబు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బలంగా ఉన్న ప్రాంతంలో ఓడిపోవడాన్ని తేలికగా తీసుకోబోమని, దీనిపై లోతుగా సమీక్షిస్తామని ఆయన తెలిపారు. గెలిచిన చోట కాకుండా ఓడిన చోట్లపై దృష్టి పెడతామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సమన్వయంతో విజయం సాధించినప్పటికీ, ఓడిపోయిన స్థానాలు మరియు ఏజెన్సీ ప్రాంతాల్లో సీట్లు తగ్గడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు వంటి ప్రాంతాల్లో స్థానికంగా ఎమ్మెల్యేలు కార్యకర్తలకు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలు ఫలితాలపై ప్రభావం చూపాయని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. స్థానిక ఎన్నికలకు ముందే, 2024 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే నియోజకవర్గాల్లో ఓటు శాతం తగ్గితే ఎమ్మెల్యేల పనితీరుపై ప్రభావం ఉంటుందని చంద్రబాబు హెచ్చరించినా ఫలితం లేదని అంటున్నారు. మొత్తం మీద, రాష్ట్రవ్యాప్త ఫలితాలపై చంద్రబాబు సంతోషంగా ఉన్నప్పటికీ, ఓటమి పాలైన మరియు ఆశించిన స్థాయిలో ఓటు శాతం రాని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నాయకుల పనితీరుపై సమీక్ష జరిపేందుకు సిద్ధమయ్యారు.


క్యాన్సర్ నుంచి అల్జీమర్స్ వరకు ఏ రోగాలు ఉండవు.. ఏఐతో అన్నీ మటాషేనట..!

వచ్చే పదేళ్లలో క్యాన్సర్, అల్జీమర్స్, గుండె జబ్బులు వంటి ప్రాణాంతక వ్యాధులకు ఏఐతో మెరుగైన చికిత్సలు అందుబాటులోకి రావచ్చని ఆంధ్రోపిక్ సీఈఓ డారియో అమోడీ అంచనా వేశారు. కొత్త మందుల తయారీ, వ్యాధులను ముందుగానే గుర్తించడంలో ఏఐ కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. అయితే మందుల పనితీరును నిర్ధారించేందుకు క్లినికల్ ట్రయల్స్ తప్పనిసరి.ఏఐతో జాబులు పోతున్నాయి.. కంపెనీలు ఉద్యోగులను తీసేస్తున్నాయి.. అందరూ రోడ్డున పడుతున్నారు.. సూపర్ ఏఐతో ప్రపంచానికి వినాశనం అంటూ అన్నీ డేంజర్ బెల్స్ లాంటి వార్తలే ఇన్నాళ్లు వింటున్నాం.. కానీ ఏఐతో కొన్ని కొన్ని మంచి పనులు కూడా ఉన్నాయి. అవి భవిష్యత్తులో అద్భుతాలకు నాంది పలకబోతున్నాయి. ఇది నిజంగా ఒక అద్భుతమైన వార్తనే.. ఏఐతో ఉపద్రవాలే కాదు..కొన్ని మంచి పనులు కూడా జరుగబోతున్నాయన్న విషయం తాజాగా బయటపడింది.క్యాన్సర్ నుంచి అల్జీమర్స్ దాకా.. పదేళ్లలో జబ్బులన్నీ మాయమట.. ఎంత హ్యాపీ న్యూస్.. ఆంధ్రోపిక్ సీఈఓ డారియో అమోడీ గారి జోస్యం వింటుంటే.. రాబోయే కాలంలో డాక్టర్లు, హాస్పిటల్స్ కూడా బోర్డులు తిప్పేసి ఏకంగా మందుల షాపుల ముందు 'ఫ్రీ గాలి పీల్చుకోండి' బోర్డులు పెట్టుకోవాల్సి వస్తుందేమోననిపిస్తోంది. ఏఐ పుణ్యమా అని వచ్చే దశాబ్దంలో ప్రాణాంతక వ్యాధులన్నీ పరార్ అయిపోతాయట. మరి ఈ అంచనాల వెనుక అసలు కథేంటి? టెక్ గురూల మాటలు నమ్మి మనం మురిసిపోవచ్చా? లేదా మన హెల్త్ ఇన్సూరెన్స్ రెన్యూవల్స్ ఆపేయాలా? అన్నది మీరు బాగా ఆలోచించి ఓ నిర్ణయం తీసుకోండి సుమా..

మామూలుగా అయితే ఒక కొత్త బిళ్ల మార్కెట్లోకి రావాలంటే శాస్త్రవేత్తల తలప్రాణం తోకకొస్తుంది. వేల రసాయనాలను కలిపి ప్రయోగాలు చేసి ఏళ్ల తరబడి పరిశోధనలు చేయాలి. ఇదంతా ఒక పెద్ద మహాభారతం. కానీ మన ఏఐ మాత్రం ఈ కొండంత పనులను క్షణాల్లో చిటికెలో చేసేస్తుందట. వేలాది రిసెర్చ్ పేపర్లు.. జన్యు సమాచారాన్ని ఇట్టే జల్లెడపట్టి.. కొత్త మందుల డిజైన్లను టక్కున బయటపెడుతుంది. చూడబోతే రాబోయే రోజుల్లో ల్యాబ్‌లలో శాస్త్రవేత్తల కంటే కంప్యూటర్లే ఎక్కువ ముఖం మాడ్చుకుని కూర్చునేలా ఉన్నాయి..

క్యాన్సర్ లాంటి మహమ్మారిపై కూడా ఏఐ దండయాత్ర మొదలుపెట్టేసిందట. క్యాన్సర్‌కు ఒకటే మందు ఉండదు.. ఎందుకంటే దాని వేషాలు వంద రకాలు.. ఏ రోగికి ఏ ట్రీట్మెంట్ సూట్ అవుతుందో పై చిటికెలో పసిగట్టేసి పర్సనలైజ్డ్ చికిత్స అందిస్తుందట.. ఇక మతిమరుపు తెచ్చే అల్జీమర్స్.. ప్రాణాలు తీసే గుండె జబ్బులను కూడా ముందుగానే పట్టుకుని 'బొగ్గు' చేసేస్తామని టెక్ నిపుణులు చెబుతున్నారు. డిప్రెషన్ లాంటి మానసిక సమస్యలకైతే డేటా చదివి మరీ కౌన్సిలింగ్ ఇస్తుందట...అయితే అసలు మ్యాటర్ ఇక్కడే ఉంది.. ఏఐ ఎంత 'అల్లరి' చేసినా.. అది సూచించిన మందులు నిజంగా పనిచేస్తాయా లేదా అని తేలాలంటే క్లినికల్ ట్రయల్స్ తప్పవు. రోగి బాడీ దాన్ని అక్సెప్ట్ చేస్తుందా? సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయా లేదా అనేది కంప్యూటర్ స్క్రీన్ మీద కనిపించదుగా... పైగా మానసిక ఆరోగ్యం అనేది కేవలం డేటాతో ముడిపడిన సబ్జెక్ట్ కాదు.. మనుషుల భావోద్వేగాలు.. కష్టాలు అల్గారిథమ్‌లకు ఏపాటి అర్థమవుతాయి? డాక్టర్ల స్థానాన్ని ఏ టెక్కీ సాఫ్ట్‌వేర్ కూడా పూర్తిగా భర్తీ చేయలేదు.అందుకే ఆంధ్రోపిక్ సీఈఓ డారియో అమోడీ అద్భుతాల గారి అంచనాలు భవిష్యత్తుపై కాస్త ఆశలు రేపుతున్నా.. 2036 నాటికి ప్రపంచమంతా రోగ విముక్తి అయిపోతుందని మాత్రం నమ్మేయలేం. ఒకవేళ నిజంగానే ఇవన్నీ జరిగితే మంచిదే కానీ.. ఆ టెక్ ట్రీట్మెంట్లు సామాన్యుడికి అందుతాయా? లేక సంపన్నుల కోటలకే పరిమితమవుతాయా అనేది అసలు ప్రశ్న. రాబోయే పదేళ్లు వైద్య రంగానికి మాత్రమే కాదు.. మన 'అటెన్షన్ స్పాన్'కు కూడా బిగ్ టెస్ట్ లాంటివే..

షుగర్ ఉన్న వాళ్లకు.. 21 రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఎక్కువ..!



షుగర్ కు క్యాన్సర్ కు ఏదైనా సంబంధం ఉందా..? షుగర్ ఉన్నవారిలో క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయా..? అనే చాలామంది డౌట్స్ ఉంటాయి. అయితే ఇటీవల జరిపిన పరిశోధనల్లో వీటి మధ్య సంబంధాన్ని పరిశోధకులు క్షుణ్ణంగా పరిశీలించి ఓ రిపోర్టును ప్రచురించారు. షుగర్ తో క్యాన్సర్ ముప్పు, క్యాన్సర్ తో షుగర్ వచ్చే ప్రమాదం ఎక్కువే.. షుగర్ ఉన్న వ్యక్తులలో అత్యంత సాధారణమైన 24 రకాల క్యాన్సర్లలో 21 రకాలు అధికంగా సంభవిస్తున్నాయని ఈ పరిశోధనలు సూచిస్తున్నాయని చెబుతున్నారు. షుగర్ ఉన్నవారిలో కాలేయం, క్లోమం, పెద్దప్రేగు, రొమ్ము,గర్భాశయ క్యాన్సర్లు బయటపడుతున్నాయని, అంతేకాకుండా క్యాన్సర్ ,దాని చికిత్సలు రక్తంలో చక్కెర నియంత్రణకు అంతరాయం కలిగించి రోగులలో షుగర్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుందంటున్నారు. 2026లో డయాబెటిస్ థెరపీ జర్నల్‌లో ప్రచురించబడిన ఈ సమీక్ష, దేశవ్యాప్తంగా దాదాపు 50 లక్షల మందిపై నిర్వహించిన పరిశోధన ఆధారంగా రూపొందించినట్లు చెప్పారు పరిశోధకులు.షుగర్ ఉన్న వారిలో నాన్-హాడ్కిన్ లింఫోమాకు 11శాతం, కాలేయ క్యాన్సర్‌కు 200శాతం కంటే ఎక్కువగా ముప్పు పెరిగినట్లు గుర్తించారు. ప్యాంక్రియాటిక్, పెద్దప్రేగు, రొమ్ము, ఎండోమెట్రియల్, మూత్రాశయ, మూత్రపిండ, థైరాయిడ్, కడుపు, అండాశయ క్యాన్సర్లు సైతం ఈ లిస్టులో ఉన్నాయి.అయితే, టైప్ 2 మధుమేహం ఉన్న పురుషులలో ప్రోస్టేట్ క్యాన్సర్ సంభవం తక్కువగా నమోదైనట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే ఇది అన్ని క్యాన్సర్లలో ఒకేవిధంగా ఉండదని, ఉమ్మడి ప్రమాద కారకాలు కూడా కారణం అవుతాయని హెచ్చరించారు.మరోవైపు క్యాన్సర్ చికిత్సతో కూడా షుగర్ అటాక్ అయ్యే అవకాశం ఉందని ఈ పరిశోధనలో గుర్తించినట్లు పరిశోధకులు చెబుతున్నారు. క్యాన్సర్ చికిత్సలో వాడే స్టెరాయిడ్లు, లక్షిత చికిత్సలు, ఇమ్యునోథెరపీ, హార్మోన్ థెరపీ వంటివి రక్తంలో చక్కెర నియంత్రణకు అంతరాయం కలిగించి మధుమేహం వచ్చే ముప్పు పెంచవచ్చని తెలిపారు. క్యాన్సర్ చరిత్ర లేని వారితో పోలిస్తే, క్యాన్సర్ నుంచి కోలుకున్న వారికి షుగర్ వచ్చే ముప్పు 39శాతం ఎక్కువగా ఉందని 13 కోహార్ట్ అధ్యయనాల విశ్లేషణ తేల్చింది.

మనదేశంలో సుమారు 10.1 కోట్ల మంది వయోజనులు షుగర్ తో బాధపడుతున్నారు. మరో 13.6 కోట్ల మంది ప్రీడయాబెటిస్‌తో జీవిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో నోటి క్యాన్సర్ ఉన్నవారిలో షుగర్ అధికంగా ఉన్నట్లు ఈ అధ్యయనంలో గుర్తించారు.

క్యాన్సర్ నివారణ, చికిత్స, పోస్ట్-కేర్‌లో జీవక్రియ ఆరోగ్యాన్ని అంతర్భాగంగా పరిగణించాల్సిన అవసరం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. షుగర్ ఉన్నవారు వయస్సు, ప్రమాద స్థాయికి తగిన క్యాన్సర్ స్క్రీనింగ్ సూచనలు పాటించాలని సూచిస్తున్నారు.

తరచూ అజీర్తి, జీర్ణ సమస్యలు వస్తున్నాయా..? అయితే.. మీ లివర్ ఈ సిగ్నల్ ఇస్తున్నట్లే..!



బిజీ లైఫ్ స్టయిల్ కారణంగా చాలామంది హెల్దీ డైట్ ఫాలో కావట్లేదు. దీనికి తోడు మానసిక ఒత్తిడి, పొల్యూషన్ వల్ల శరీరంలో టాక్సిన్లు పెరిగిపోతాయి. ఇవి ఆర్గాన్స్, టిష్యూసిని డ్యామేజ్ చేస్తాయి. టాక్సిన్లు ఎక్కువైనప్పుడు బాడీలో ఆటోమెటిక్ గా డీటాక్సిఫికేషన్ జరుగుతుంది. ఒకవేళ అలా జరగనప్పుడు శరీరం కొన్ని సిగ్నల్స్ ఇస్తుంది అంటున్నారు డాక్టర్లు. అవేమిటంటే...

రెగ్యులర్ గా అజీర్తి, జీర్ణపరమైన సమస్యలు వస్తున్నాయంటే శరీరంలో టాక్సిన్లు పెరిగాయని, డీటాక్స్ చేసుకోవాల్సిన టైమ్ వచ్చిందని గ్రహించాలి. టాక్సిన్లను బయటికి పంపించే డీటాక్సిఫికేషన్ లివర్ లో ఎక్కువగా జరుగుతుంది. అయితే కాలేయం మీద ఒత్తిడి ఎక్కువై ఎసిడిటీ, కడుపు ఉబ్బరం, డయేరియా వంటి లక్షణాలు కనిపిస్తాయి.

తొందరగా అలసిపోవడం

ఒక్కోసారి కంటినిండా నిద్రపోయినా కూడా రోజంతా హుషారుగా అనిపించదు. తొందరగా అలసిపోతుంటారు. అందుకు కారణం టాక్సిన్లు. అలసి పోయినప్పుడు అడ్రినల్ గ్లాండ్స్ మీద ఒత్తిడి ఎక్కువైతుంది. టాక్సిన్ల కారణంగా కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దాంతో గ్లాండ్స్ పనితీరు మారుతుంది.

మూడ్ స్వింగ్స్

తరచుగా మూడ్ స్వింగ్స్ ఉంటున్నా. నిద్రలేకపోయినా, ఆందోళన పడుతున్నా... ఒంట్లో టాక్సిన్లు పెరిగాయని గమనించాలి. కొన్నిరకాల టాక్సిన్లు హార్మోన్ల పనితీరుని దెబ్బతీస్తాయి. మరికొన్ని అయితే మెదడులోని కణాల్ని సైలెంట్ చేస్తాయి. దాంతో మూడ్ స్వింగ్స్ ఎక్కువైతాయి.

బరువులో హెచ్చుతగ్గులు

క్యాలరీల లెక్క పక్కాగా ఉన్నా కూడా కొందరు బరువు పెరుగుతారు. లేదా బరువు తగ్గుతారు. అందుకు కారణం అడిపోస్ టిష్యూస్ (ఫ్యాట్ సెల్స్) టాక్సిన్లకి అంటుకుని ఉంటాయి. దాంతో శరీరం వీటిని ఇతర కణాలుగా పొరబడి వాటిని వదిలేస్తుంది. ఇలా జరుగుతుంటే శరీరాన్ని డీటాక్స్ చేసుకోవాలని గ్రహించాలి.

డయేరియా

డైట్లో యాంటీ ఆక్సిడెంట్లు తగ్గినప్పుడు శరీరంలో టాక్సిన్లు పెరిగిపోతాయి. ఈ టాక్సిన్లు రక్తంలో కలిసి కొన్నిసార్లు డయేరియాకి కారణమవుతాయి. అలాగే కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నప్పుడు బాడీని డీటాక్స్ చేసుకోవడం ముఖ్యం. డీటాక్స్ అనగానే కూరగాయలు, పండ్ల రసాలు తాగినా, ఉపవాసం ఉన్నా సరిపోతుంది అనుకుంటారు చాలా మంది. డీటాక్స్ అనేది బయలాజికల్ ప్రాసెస్. చెమట, ఊపిరి, యూరిన్ రూపంలో శరీరంలోని మలినాల్ని, వేస్ట్ని బయటకి పంపించే నిరంతర ప్రక్రియ.

యమధర్మరాజుకు సహాయకుడు ఎందుకు అవసరమయ్యాడు ? చిత్రగుప్తుడు ఎలా పుట్టాడు? ఆయన అసలు రూపం ఏంటో తెలుసా?



మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు చేసే ప్రతి పనికి లెక్క ఉంటుందని హిందూ పురాణాలు చెబుతాయి. మనం చేసే మంచి పనులు పుణ్యాలుగా, చెడు పనులు పాపాలుగా లెక్కించబడతాయని నమ్మకం. ఈ పాపపుణ్యాల లెక్కలు చూసే బాధ్యత చిత్రగుప్తుడికి ఉంటుందని పురాణాల్లో చెప్పబడింది.ఒక మనిషి చనిపోయిన తర్వాత అతను చేసిన మంచి, చెడు పనుల ఆధారంగా స్వర్గానికి వెళ్లాలా? నరకానికి వెళ్లాలా? అనేది యమధర్మరాజు నిర్ణయిస్తాడని హిందువుల విశ్వాసం.అయితే అసలు చిత్రగుప్తుడు ఎవరు? ఆయన ఎలా జన్మించారు? యమధర్మరాజుకు ఆయన ఎందుకు సహాయకుడిగా మారారు? ఆయన నిజమైన రూపం ఎలా ఉంటుంది? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం...

చిత్రగుప్తుడిని ఎందుకు పూజిస్తారు?

హిందూ సంప్రదాయంలో చిత్రగుప్తుడికి ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో దీపావళి తర్వాత వచ్చే భాయ్ దూజ్ రోజున చిత్రగుప్త పూజను ఘనంగా నిర్వహిస్తారు.పురాణాల ప్రకారం, చిత్రగుప్తుడు ప్రతి మనిషి జీవితంలో చేసే మంచి, చెడు పనుల వివరాలను రాస్తుంటాడు. అంటే మనిషి ఎవరికి సహాయం చేశాడు? ఎవరికి కష్టం కలిగించాడు? ఎలాంటి మంచి పనులు చేశాడు? ఎలాంటి తప్పులు చేశాడు? ఇలా ప్రతి ఒక్కరి కర్మల లెక్కను చిత్రగుప్తుడు రాస్తుంటాడని నమ్ముతారు.మనిషి మరణించిన తర్వాత ఈ లెక్కలను యమధర్మరాజు ముందు ఉంచుతాడని పురాణ కథలు చెబుతాయి. వాటి ఆధారంగా ఆ వ్యక్తికి ఎలాంటి ఫలితం దక్కాలో నిర్ణయిస్తారని హిందూ ధర్మ విశ్వాసం.

చిత్రగుప్తుడు ఎలా జన్మించారు?

పురాణాల్లో చిత్రగుప్తుడి జననం వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. పురాణాల ప్రకారం, బ్రహ్మదేవుడు ఈ సృష్టిని ప్రారంభించి సమస్త జీవరాశులను సృష్టించిన తర్వాత ఒక ముఖ్యమైన సమస్య ఎదురైంది. ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి జీవి చేసే మంచి, చెడు పనులను ఎవరు గమనించాలి? వారి కర్మలకు తగిన ఫలితాలను ఎవరు అందించాలి? అనే ప్రశ్న వచ్చింది.

అప్పుడు జీవుల మరణం తర్వాత వారి కర్మలకు తగిన ఫలితాలు అందించే బాధ్యతను నిర్వహించడానికి బ్రహ్మదేవుడు యమధర్మరాజును సృష్టించాడని పురాణాలు చెబుతున్నాయి. యమధర్మరాజుకు మనుషుల పాపపుణ్యాలను బట్టి న్యాయం చేసే బాధ్యతను అప్పగించారు.

కానీ రోజులు గడిచేకొద్దీ భూమిపై మనుషుల సంఖ్య పెరిగింది. ప్రతి ఒక్కరూ ఎన్నో రకాల పనులు చేయడం మొదలుపెట్టారు. ఇంతమంది మనుషుల పనులను గమనించడం, వారి పాపపుణ్యాల లెక్కలను నిర్వహించడం యమధర్మరాజుకు కష్టంగా మారింది. దీంతో ఆయన బ్రహ్మదేవుడిని కలిసి తనకు ఒక సమర్థుడైన సహాయకుడిని ఇవ్వాలని కోరాడు.

బ్రహ్మదేవుడి తపస్సు.. చిత్రగుప్తుడి ఆవిర్భావం!

యమధర్మరాజు కోరిక విన్న బ్రహ్మదేవుడు లోకంలోని జీవుల కర్మలను సరిగ్గా లెక్కించే వ్యక్తి అవసరమని భావించాడు. దీంతో ఆయన కొంతకాలం ధ్యానం, తపస్సు చేశాడు. ఆ తపస్సు ఫలితంగా బ్రహ్మదేవుడి నుంచి ఒక తేజస్సుతో నిండిన దివ్య పురుషుడు ఆవిర్భవించాడని పురాణ కథనం. ఆయనే చిత్రగుప్తుడు. అలా జన్మించిన చిత్రగుప్తుడికి మనుషుల పాపపుణ్యాల లెక్కలు రాసే బాధ్యతను అప్పగించారు. అప్పటి నుంచి ఆయన యమధర్మరాజుకు ముఖ్యమైన సహాయకుడిగా మారాడు.ప్రతి మనిషి చేసిన మంచి, చెడు పనుల వివరాలను నమోదు చేస్తూ, మరణం తర్వాత ఆ వివరాలను యమధర్మరాజుకు అందిస్తుంటాడని పురాణాలు చెబుతున్నాయి. చిత్రగుప్తుడి జననానికి సంబంధించిన కథలు బ్రహ్మవైవర్త పురాణం, పద్మ పురాణం, గరుడ పురాణం వంటి పురాణ గ్రంథాల్లో ప్రస్తావించబడ్డాయి.

చిత్రగుప్తుడి అసలు రూపం ఎలా ఉంటుంది?

చిత్రగుప్తుడిని సాధారణ వ్యక్తిలా కాకుండా దివ్యమైన తేజస్సుతో కనిపించే దేవుడిగా పురాణాలు వర్ణిస్తాయి. ఆయన ముఖంలో ప్రశాంతత, గంభీరత కనిపిస్తాయని చెబుతారు. ముఖ్యంగా న్యాయానికి ప్రతీకగా చిత్రగుప్తుడిని భావిస్తారు. సాధారణంగా చిత్రగుప్తుడిని నాలుగు చేతులు ఉన్న రూపంలో చిత్రిస్తారు.

ఆయన చేతుల్లో కలం, సిరాబుడ్డి, కర్మల వివరాలు రాసే పుస్తకం వంటి వస్తువులు ఉంటాయి. ఇవి మనుషుల పనులను లెక్కించడం, వాటిని నమోదు చేయడం అనేవి ఆయన బాధ్యతకు గుర్తులుగా భావిస్తారు. అంతేకాదు, ఆయన రాజవస్త్రాలు ధరించి, తలపై బంగారు కిరీటం, చెవులకు ఆభరణాలు, మెడలో రత్నాల హారంతో దివ్యంగా కనిపిస్తారని చిత్రాల్లో చూపిస్తారు.

చిత్రగుప్తుడి పూజ వెనుక ఉన్న అసలు భావం ఏమిటి?

చిత్రగుప్తుడిని పూజించడం అంటే కేవలం ఒక దేవుడిని ఆరాధించడం మాత్రమే కాదు. మనం చేసే ప్రతి పనికి బాధ్యత వహించాలనే మంచి సందేశం కూడా ఇందులో ఉందని చెప్పవచ్చు. మన జీవితంలో ఇతరులకు సహాయం చేయడం, నిజాయితీగా ఉండడం, ఎవరినీ బాధపెట్టకుండా జీవించడం వంటి మంచి పనులు చేయాలని ఈ పూజ గుర్తుచేస్తుంది.

మనిషి చేసే ప్రతి పనికి ఏదో ఒక ఫలితం ఉంటుందని, అందుకే మంచి మార్గంలో నడవాలని చిత్రగుప్తుడి కథ మనకు తెలియజేస్తుంది. మనిషి జీవితంలో చేసే ప్రతి పనికి లెక్క ఉంటుందనే నమ్మకానికి చిత్రగుప్తుడు ప్రతీక. అందుకే హిందూ సంప్రదాయంలో ఆయనకు ప్రత్యేకమైన స్థానం ఉంది.

సరిజోడి కోసం వెతుకుతున్నారిలా.. పర్ఫెక్ట్ లైఫ్ పార్ట్‌నర్‌ని వెతుక్కోవడం ఇంత ఈజీనా..!?





డేటింగ్ యాప్స్, మ్యాట్రిమోనీ వెబ్ సైట్లు వచ్చిన తర్వాత పర్ఫెక్ట్ లైఫ్ పార్ట్?నర్?ని వెతుక్కోవడం ఈజీ అయింది. జీవిత భాగస్వామిలో ఎలాంటి క్వాలిటీస్ ఉండాలి? అనే విషయంలో ఈ కాలం అబ్బాయిలు, అమ్మాయిల ఆలోచనలు మారుతున్నాయి. చాలామంది ఆన్ లైన్ చాటింగ్ చేసి, అవతలి వాళ్ల మీద ఒక అంచనాకి వస్తున్నారు. సొంతంగా డెసిషన్ కూడా తీసుకుంటున్నారు. అంతేకాదు తమకి అన్ని విధాలా మ్యాచ్ అయ్యే వ్యక్తి దొరికేంత వరకు కాంప్రమైజ్ అవ్వట్లేదు.ఈ జనరేషన్ వాళ్లలో 67 శాతం మంది డేటింగ్ యాప్స్ ద్వారానే తమకి సరైన జోడిని వెతుక్కుంటున్నారు. ఈరోజుల్లో అమెరికాలోని ప్రతి మూడు జంటల్లో ఒకరు డేటింగ్ యాప్స్ ద్వారానే ఒక్కటవుతున్నారు. మనదేశంలో కూడా ఇదే తీరు కనిపిస్తోంది. ఆన్ లైన్ డేటింగ్ సాయంతో తాము కోరుకున్న క్వాలిటీస్ ఉన్న వ్యక్తిని కలుసుకునే అవకాశం పెరిగింది అని ఈతరం భావిస్తుంది.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో వారివారి ఇష్టాలు, ప్రిఫరెన్స్?లకు సరిపోయే వ్యక్తిని వెతకడం మరింత సులువైంది. డేటింగ్ యాప్?లో కోరుకునే వ్యక్తి వయసు, ఎత్తు, ఎక్కడ ఉంటారు? ఎంత చదువుకున్నారు? ఎంత సంపాదిస్తున్నారు? వంటి వివరాలు చెబితే చాలు... మ్యాచ్ అయిన అమ్మాయి లేదా అబ్బాయిల ప్రొఫైల్ కనిపిస్తుండటమే ఇందుకు కారణం.

చిటికెడు ఇంగువ.. బోలెడు లాభాలు..!



ఇంగువ చేసే మేలు అంతా ఇంతా కాదు. రసం, సాంబారు, పచ్చళ్లు, తాలింపుల్లో మాత్రమే దీన్ని వాడుతుంటారు చాలామంది. కానీ అన్ని కూరల్లో ఇంగువ వేసి తింటే ఆరోగ్యానికి చాలామంచిది. ఇంగువతో ఎన్ని లాభాలో ఒకసారి చూద్దాం...

ఇంగువకు మంచి వాసన ఉంటుంది. ఇది కూరల్లో చేర్చితే మంచి రుచిని కూడా ఇస్తుంది. ఇంగువలో ప్రత్యేక వైద్య గుణాలున్నాయి. ఇంగువ శరీర ఉష్ణాన్ని తగ్గిస్తుంది. అజీర్తికి చెక్ పెడుతుంది. రుచిని పెంచుతుంది. వాతాన్ని, కఫాన్ని నిరోధిస్తుంది. పిత్తాన్ని దూరం చేస్తుంది. కడుపు ఉబ్బరం, పొట్ట పేగుల్లోని బ్యాక్టీరియాను నశింపజేస్తుంది.

ఇంగువను రెగ్యులర్ గా తింటే గ్యాస్, కడుపు నొప్పిలాంటి సమస్యలు తగ్గుతాయి.

యాంటీ బయాటిక్, యాంటీ వైరల్, యాంటీ ఇన్ ఫ్లమేటరీలు ఇంగువలో ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి, దీన్ని రెగ్యులర్ గా తినడం వల్ల శ్వాస సమస్యలు ఉండవు.

వేడి నీళ్లలో చిటికెడు ఇంగువ కలిపి తాగితే తలనొప్పి మాయమవుతుంది.

కడుపులో నులిపురుగుల సమస్య ఉన్నా వాముతో కలిపి తింటే తగ్గుతుంది.

వారానికి రెండుసార్లు అన్నంలో మొదటి ముద్ద నెయ్యి, వాము, ఇంగువతో కలిపి తింటే జీర్ణ సమస్యలుండవు.

దగ్గును దరిచేరనివ్వదు.

శ్వాస సమస్యలను దూరం చేస్తుంది.

నరాల బలహీనతకు చెక్ పెడుతుంది.

మూర్ఛ వ్యాధులను దూరం చేస్తుంది.

మహిళల ఉదరంలో ప్రసవానికి తర్వాత ఉండే మలినాలను వెలివేయడంతో ఇంగువ బాగా పనిచేస్తుంది.

ఇంగువను నూనెలో కరిగించి చెవుల్లో నాలుగైదు చుక్కలు పోస్తే.. చెవిపోటు తగ్గుతుంది. నూనెలో వేయించి ఉపయోగిస్తే.. రుచితో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుంది.

ప్రసవానికి తర్వాత వెల్లుల్లి, పటిక బెల్లం, నూనెలో వేపిన ఇంగువను చేర్చి మహిళలకు ఇస్తే మలినాలను తొలగిపోతాయి.

ఉబ్బసం, కోరింత దగ్గు, గొంతు బొంగురు, హిస్టీరియా వంటి వ్యాధులకు ఇంగువ మంచి ఔషధం

చలికాలంలో బెల్లం తింటే ఇన్ని లాభాలా?

ఆరోగ్యానికి అమృతంలా పనిచేసే అద్భుత ప్రయోజనాలు!

చలికాలం వచ్చిందంటే చాలు.. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల ఒంట్లో నీరసం, అలసట, దగ్గు, జలుబు లాంటి సమస్యలు తరచూ ఇబ్బంది పెడుతుంటాయి. ఈ చలికి చెక్ పెట్టి శరీరాన్ని వెచ్చగా ఉంచడంలో బెల్లం అద్భుతంగా పని చేస్తుంది. షుగర్‌తో పోలిస్తే బెల్లం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ముఖ్యంగా వింటర్ సీజన్‌లో దీన్ని ప్రతిరోజూ ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బెల్లంలో ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. 100 గ్రాముల బెల్లంలో దాదాపు 11 మిల్లీగ్రాముల వరకు ఈ ఖనిజాలు లభిస్తాయి.

బెల్లం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు:

రక్తహీనతకు చెక్: బెల్లంలో ఉండే ఐరన్ శాతం శరీరంలో హిమోగ్లోబిన్‌ను వేగంగా పెంచుతుంది. ఇది రక్తహీనత సమస్యను తగ్గించి, నీరసం, అలసటను దరిచేరనీయకుండా రోజంతా ఎనర్జిటిక్‌గా ఉంచుతుంది.

దగ్గు, జలుబు దూరం: బెల్లంలో సహజమైన యాంటీ-అలర్జీ గుణాలు ఉంటాయి. ఇది శీతాకాలంలో తరచూ వచ్చే దగ్గు, జలుబు, శ్వాసకోశ సమస్యల నుంచి రక్షణ కల్పిస్తుంది.

మెరుగైన జీర్ణక్రియ: బెల్లంలో మెగ్నీషియంపాళ్లు ఎక్కువగా ఉండటం వల్ల మనం తిన్న ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో ఇది ఎంతగానో సహాయపడుతుంది.

బెల్లంతో ఆరోగ్యకరమైన బెస్ట్ కాంబినేషన్స్:

కేవలం బెల్లం విడిగా తినడం ఇష్టం లేని వారు ఇతర ఆరోగ్యకరమైన పదార్థాలతో కలిపి తీసుకోవచ్చు.. శీతాకాలానికి ఇవి అత్యంత శ్రేయస్కరం.

బెల్లం – వేరుశనగలు (పల్లి చిక్కీ): పల్లీలు, బెల్లం కలిపి తయారు చేసే పల్లిపట్టి రూపంలో తీసుకోవడంతో మహిళల్లో పీరియడ్స్ నొప్పులు తగ్గుతాయి. శరీరానికి కావాల్సిన శక్తి అందుతుంది.బెల్లం – పుట్నాల శనగలు: బెల్లం, పుట్నాలు కలిపి తింటే శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. హిమోగ్లోబిన్ స్థాయిలు మెరుగవుతాయి.

పసుపు – బెల్లం – నెయ్యి: ఈ కాంబినేషన్ చలికాలంలో దివ్యౌషధంగా పని చేస్తుంది. రోగనిరోధక శక్తిని విపరీతంగా పెంచేందుకు ఇది అత్యుత్తమ మిశ్రమం.

బెల్లం – నువ్వులు – నెయ్యి: నువ్వులు, నెయ్యి, బెల్లం కలిపి తింటే చలికాలంలో వేధించే దగ్గు, జలుబు సమస్యలను సులభంగా ఎదుర్కోవచ్చు. శరీరం లోపలి నుంచి వెచ్చగా ఉంటుంది. ఇకపై చలికాలంలో మీ డైట్‌లో బెల్లంను కచ్చితంగా చేర్చుకోండి.. ఆరోగ్యాన్ని మీ సొంతం చేసుకోండి..

సమాధానమే సరైన దారి!

దేశంలో ఇటీవల కనిపిస్తున్న విద్యార్థి నిరసనలను ఒక్కసారిగా పుట్టిన అసంతృప్తిగా చూడటం పొరపాటు. ఏళ్ల తరబడి పేరుకున్న ఫిర్యాదులపై ఉద్యమం నిలబడిందన్న వాదన వాస్తవం. ప్రజాస్వామ్యానికి ముప్పుందని భావిస్తే.. ముందుగా స్పందించేది విద్యార్థులే. 2015లో పుణే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు గజేంద్ర చౌహాన్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ 139 రోజుల పాటు నిరసన తెలిపారు. తర్వాత రోహిత్ వేముల ఘటనపై ఉద్యమం, జేఎన్‌యూ విద్యార్థులపై రాజద్రోహం కేసులపై నిరసనలు, నజీబ్ అహ్మద్ అదృశ్యంపై ప్రశ్నలు, వివిధ విశ్వవిద్యాలయాల్లో ఫీజుల పెంపుపై ఆందోళనల నుంచి 2012 నిర్భయ ఉద్యమం వరకూ యువత సామాజిక సమస్యలపై ఎంతగా స్పందిస్తారో చూడొచ్చు. పాలకులు ఇలాంటి నిరసనలను 'దేశ వ్యతిరేకం' అని కొట్టిపారేయడం సులువే. కానీ అలా చేస్తే సమస్య పరిష్కారం కాదని, అది రూపం మార్చుకుని మళ్లీ వస్తుందని చరిత్ర చెబుతోంది. 2026లో అలాంటి రూపమే.. వీధికెక్కిన సీజేపీ వ్యంగ్య యువ ఉద్యమం. జూన్ 6న వేలాదిగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేరారు. జూన్ 28న పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షతో ఉద్యమానికి నైతిక బలం వచ్చింది. జూలై 20న పార్లమెంటు వైపు జరిగిన ప్రదర్శన ఘర్షణగా మారింది. జూలైలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఇది ఉద్యమానికి దక్కిన పెద్ద విజయమన్నది విశ్లేషకుల మాట. అయితే అధికార బీజేపీ మాత్రం, నిజమైన విద్యార్థి ఉద్యమాన్ని ప్రతిపక్షాలు రాజకీయ లాభం కోసం స్వాధీనం చేసుకున్నాయని ఆరోపించింది. ఈ వాదనలకు -కాలమే సమాధానమివ్వాలి.

ఈ తరం నిరసనల తీరులో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. జెన్ జీ యువత మీమ్స్, రీల్స్, వ్యంగ్యం, చమత్కారాన్నే రాజకీయ భాషగా మార్చుకుంది. నిరసన స్థలం కూడా వీడియోలు తీసే వేదికైంది. ఇన్‌స్టాగ్రామ్, రెడిట్, యువత నడిపే యూట్యూబ్ ఛానళ్లు రాజకీయ చర్చకు కొత్త చోటయ్యాయి. అయితే, దీన్ని "జెన్ జీ"గా ముద్ర వేసి చూడటం సరికాదన్నది విశ్లేషకుల హెచ్చరిక. ఆ పదం ఒక మార్కెటింగ్ వర్గీకరణేనని, అసలు సమస్యలు నిరుద్యోగం, పరీక్షల అవినీతి వంటివని వారి వాదన. ఈ ఉద్యమం ఇప్పుడు -ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పైకి బాణం ఎక్కుపెట్టింది. బిహార్‌లో 2025 జూన్‌లో మొదలైన ఈ ప్రక్రియ ఇప్పుడు 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు విస్తరించింది. ఈ సవరణ వల్ల 13 కోట్లకు పైగా పేర్లు ముసాయిదా జాబితాల నుంచి తొలగిపోయాయని నిరసనకారులు అంటున్నారు. అయితే ఎన్నికల సంఘం ఈ లెక్కను వివాదాస్పదంగా చెబుతోంది. జాబితాల కచ్చితత్వం కోసమే సవరణ చేస్తున్నామని, ఎలాంటి అక్రమాలు జరగలేదని, నిర్ణయాలన్నీ కమిషన్ ఏకగ్రీవంగా తీసుకున్నాయని వాదిస్తోంది. అయినా కేంద్రీకృత సాఫ్ట్‌వేర్ వాడకం, స్థానిక అధికారులకు పరిమిత అధికారాలు వంటి అంశాలపై విమర్శలు ఆగలేదు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ విద్యార్థి సంఘాలు, వామపక్షాలు, కాంగ్రెస్ అనుబంధ విభాగాలు, రైతు సంఘాలు వేర్వేరు చోట్ల ప్రదర్శనలు చేశాయి. యువత ఆశలు, అసంతృప్తులకు ఎన్నికలే ప్రధాన వేదిక. ఆ ఎన్నికల వ్యవస్థపైనే నమ్మకం తగ్గితే, శాంతియుత నిరసనే వారికి మిగిలే మార్గమని ఉద్యమకారులు అంటున్నారు. ఈ క్రమంలో పోలీసు చర్యలపై విమర్శలు పెరిగాయి. అక్టోబర్ 16న 'లెహరా దో తిరంగా' యాత్ర సందర్భంగా ఏఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిపకేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తర్వాత నేహా బోరాకు శాంతి భద్రతల బాండు (పీస్ బాండ్) ఇవ్వాలని బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126 కింద నోటీసు వచ్చింది. రూ.10,000 వ్యక్తిగత పూచీకత్తు, ఒక హామీదారు కావాలని అందులో ఉంది. ఢిల్లీ హైకోర్టు ఆమె పిటిషన్‌ను కొట్టేసినా, ఆమెకు సంబంధిత పత్రాలన్నీ ఇవ్వాలని మేజిస్ట్రేట్‌కు ఆదేశాలిచ్చింది. అయినా తాను సంతకం చేయనని ఆమె స్పష్టం చేశారు. "ఎవరి శాంతిని నేను కాపాడాలి?" అని ప్రశ్నించారు. ఇది శాంతియుత నిరసన హక్కును అణచివేసే సాధనంగా మారుతోందని ఆమె ఆరోపించారు. అయితే పోలీసులు తమ వాదన వేరుగా వినిపించారు. కొందరు నిరసనకారులు విధుల్లోని సిబ్బందిపై దాడి చేశారని చెబుతున్నారు. నిషేధాజ్ఞలు ఉన్నా పదే పదే ప్రదర్శనలు జరిగాయని అంటున్నారు.

ఈ వివాదంలో తాజా మలుపు జంతర్‌మంతర్ వద్దే వచ్చింది. దశాబ్దాలుగా రైతులు, కార్మికులు, విద్యార్థులు తమ గళాన్ని వినిపించే చోటుగా ఉన్న ఆ ప్రదేశాన్ని అక్టోబర్ 11న ఢిల్లీ పోలీసులు నిర్దేశిత నిరసన స్థలంగా రద్దు చేశారు. కేంద్ర హోం శాఖ కమిటీ సిఫార్సులు, భద్రతా కారణాలు, సమీపంలోని రాయబార కార్యాలయాలు వంటివి దీనికి కారణాలుగా చెప్పారు. ఇరుకైన వారసత్వ ప్రాంతం కావడంతో మెరుగైన వసతులున్న స్థలం చూడాలని సుప్రీంకోర్టు సూచనను కూడా పోలీసులు ప్రస్తావించారు. దాని బదులు రామ్‌లీలా మైదానం, బురారీ మైదానం, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అనే మూడు చోట్లను ప్రకటించారు. ప్రభుత్వ వాదనలో కొంత నిజం ఉంది. నెలల తరబడి కొనసాగిన ఆందోళనలతో న్యూఢిల్లీ ప్రాంతంలో రాకపోకలు స్తంభించాయి, స్థానిక వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. ప్రజా శాంతిభద్రతలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత కూడా. కానీ విమర్శకుల ప్రశ్న మరో కోణంలో ఉంది. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గళం చేరాల్సింది అధికార కేంద్రం దగ్గరే. అందుకే నిరసనకు చోటు ఇవ్వమని అడిగితే ఉన్న చోటునే తొలగించడం సరైన సందేశం కాదని వారు అంటున్నారు. రాజ్యాంగం శాంతియుత సమావేశ హక్కును ఇస్తుంది, దానిపై న్యాయబద్ధమైన పరిమితులూ ఉంటాయి. ఈ రెండింటి మధ్య సమతూకం కుదరాల్సిన బాధ్యత ప్రభుత్వం, పోలీసులు, కోర్టులపై ఉంది. ఉద్యమకారులు కూడా శాంతియుత మార్గాన్ని విడవకూడదు, ఘర్షణలకు తావివ్వకూడదు. వాదనలు ఎలా ఉన్నా, ఇన్ని నెలలుగా వీధుల్లో కనిపిస్తున్న యువత ఒక వాస్తవాన్ని గుర్తు చేస్తోంది. ఉద్యోగాలు, పరీక్షల పారదర్శకత, ఓటు హక్కుపై నమ్మకం.. ఇవి నేటి తరం ఆందోళన. లాఠీలు, కేసులు, బాండ్లతో ఈ గళాన్ని కొంతకాలం తగ్గించవచ్చు, కానీ సమస్యలు తీరకపోతే అవి మరో రూపంలో తిరిగి వస్తాయి. పేపర్ లీకులకు గట్టి చట్టపరమైన పరిష్కారం, ఓటర్ల జాబితాల తొలగింపులపై పారదర్శకత, నిరసనకారులతో సంభాషణ.. ఇవే ప్రభుత్వం ముందున్న మార్గాలు. యువత హాస్యంతో, ఆశతో ప్రశ్నిస్తోంది. ఆ ప్రశ్నలకు సమాధానమివ్వడమే ప్రజాస్వామ్యాన్ని బలపరిచే దారి.

ఐజెన్‌కోట్‌కు అసలు పరీక్ష



ఇజ్రాయెల్ రాజకీయాలు మరో కీలక మలుపు తిరిగాయి. అక్టోబర్ 27న జరిగిన సాధారణ ఎన్నికల్లో ఏ శిబిరానికీ స్పష్టమైన మెజార్టీ రాలేదు. 120 మంది సభ్యుల పార్లమెంటు 'నెసెట్'లో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సింది 61 మంది మద్దతు. ఫలితాల ప్రకారం ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నాయకత్వంలోని లికుడ్ పార్టీకి సుమారు 27 స్థానాలు, మాజీ సైనిక దళాల అధిపతి గాడీ ఐజెన్‌కోట్ నేతృత్వంలోని 'యషార్' పార్టీకి 21 స్థానాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ వివిధ పార్టీలతో చర్చలు జరిపారు. నవంబర్ 7, 8 తేదీల్లో ఆయన ప్రభుత్వం ఏర్పాటు బాధ్యతను ఐజెన్‌కోట్‌కు అప్పగించారు. ఐజెన్‌కోట్‌ను 67 మంది సభ్యులు సిఫార్సు చేయగా, నెతన్యాహుకు 46 మంది మాత్రమే మద్దతు ఇచ్చారు. ఏడుగురు సభ్యుల ఒక పార్టీ ఎవరినీ సిఫార్సు చేయలేదు. కూటమి ఏర్పాటుకు ఐజెన్‌కోట్‌కు 28 రోజుల గడువుంది. అవసరమైతే మరో 14 రోజులు పొడిగించవచ్చు. ఇది నెతన్యాహుకు పెద్ద ఎదురుదెబ్బే. ఇజ్రాయెల్ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న ఆయన ఇంకా ఓటమిని అంగీకరించలేదు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, అరబ్ పార్టీలకు విదేశీ నిధులు అందాయని ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు బహిరంగంగా రుజువులు చూపలేదని వార్తా సంస్థలు చెబుతున్నాయి. ఆయన విశాల 'జాతీయ ఐక్య ప్రభుత్వం' ఆలోచనను ముందుకు తెస్తున్నారు. ఈ పరిణామాన్ని అరబ్ దేశాల టీవీ చానళ్లు ప్రముఖంగా ప్రసారం చేశాయి. అల్ జజీరా, అల్ అరేబియా, స్కై న్యూస్ అరేబియా వంటి చానళ్లు ఐజెన్‌కోట్ ముందున్న రాజకీయ సవాళ్లపై లోతైన విశ్లేషణలు ఇచ్చాయి. ఇరాన్ అనుకూల చానళ్లు కూడా తమ దృష్టికోణంలో స్పందించాయి. ఈ అరబ్ చానళ్ల ఆసక్తికి కారణం ఉంది. ఈసారి ఇజ్రాయెల్‌లోని అరబ్ పార్టీలు 19 స్థానాలు గెలుచుకున్నాయని నివేదికలు చెబుతున్నాయి. అందుకే ఈ ప్రభుత్వ ఏర్పాటులో వారి పాత్ర కీలకం.

అయితే ఐజెన్‌కోట్ ముందున్న దారి సులువు కాదు. ఆయనకు సిఫార్సు చేసిన 67 మందిలో అరబ్ పార్టీల సభ్యులు ఉన్నారు. కానీ ఆయన కూటమి ప్రభుత్వంలో అరబ్ పార్టీలను చేర్చుకోబోనని ముందే స్పష్టం చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. దాంతో ఆయన ముందు మూడు మార్గాలు కనిపిస్తున్నాయి. మొదటిది, అరబ్ పార్టీల బయటి మద్దతుతో మైనారిటీ ప్రభుత్వం ఏర్పాటు. 'జాయింట్ లిస్ట్' నాయకుడు అహ్మద్ తిబీ ఇదే సూచిస్తున్నారు. నెతన్యాహు ప్రభుత్వాన్ని దించడమే ప్రధాన లక్ష్యం కావాలని, దానికి 'రాజకీయ ధైర్యం' అవసరమని అన్నారు. మన్సూర్ అబ్బాస్ నేతృత్వంలోని యునైటెడ్ అరబ్ లిస్ట్ (రాఅమ్) అధికారిక ఒప్పందం లేకపోయినా మద్దతివ్వడానికి సిద్ధంగా ఉందని అల్ అరేబియా చానల్ పేర్కొంది. అబ్బాస్ ఇప్పటికే ఐజెన్‌కోట్‌తో, ప్రతిపక్ష నేత యాయిర్ లాపిడ్‌తో చర్చలు జరిపారని ఆ చానల్ చెప్పింది. 2021లో ఏర్పడిన నఫ్తాలీ బెన్నెట్-లాపిడ్ ప్రభుత్వంలో ఈ పార్టీ భాగమైన సంగతి గుర్తు చేసుకోవాలి. రెండో మార్గం, కఠిన సంప్రదాయవాద యూదు పార్టీలతో ఒప్పందం చేసుకోవడం. మూడోది, నెతన్యాహు శిబిరంలోని కొన్ని వర్గాలను కలుపుకుని 'జాతీయ ఐక్య ప్రభుత్వం' ఏర్పాటు చేయడం. కానీ ప్రతి మార్గంలోనూ ముళ్లున్నాయి. ప్రతిపక్ష నేత అవిగ్డోర్ లీబర్‌మన్ అరబ్ పార్టీల ఓట్లపై ఆధారపడే ఎలాంటి ప్రభుత్వాన్నీ వ్యతిరేకిస్తున్నారని స్కై న్యూస్ అరేబియా చానల్ గుర్తు చేసింది. హమాస్ విషయంలో అబ్బాస్ వైఖరి కూడా కొంత వివాదాస్పదమైందని కొన్ని ఇజ్రాయెలీ నివేదికలు అంటున్నాయి. మైనారిటీ ప్రభుత్వం సాధ్యం కావాలంటే, అరబ్ పార్టీలతో పాటు కొన్ని మతపరమైన పార్టీలు ఓటింగ్‌కు దూరంగా ఉండాలని విశ్లేషకుడు ఇస్మత్ మన్సూర్ వివరించారు. నెతన్యాహు రాజకీయ ఎత్తులతో లేదా భద్రతా ఉద్రిక్తతలతో ఈ ప్రక్రియను అడ్డుకోకముందే త్వరగా కూటమి ఏర్పాటు చేయాలన్నది ఆయన సలహా. ఇదంతా సిద్ధాంత విభేదాలను పక్కన పెట్టి, 'నెతన్యాహును తొలగించడం' అనే ఒకే లక్ష్యంతో విభిన్న శక్తులు కలవగలవా? అనే ప్రశ్నకు సమాధానం వెతుకుతోంది. ఈ చర్చలో ఇంకో సున్నితమైన కోణం ఉంది. అరబ్ సమాజంపై నెతన్యాహు పదేపదే చేస్తున్న వ్యాఖ్యలను ఇరాన్ అనుకూల చానళ్లు ప్రస్తావించాయి. అరబ్ పార్టీలు ఐజెన్‌కోట్ ప్రభుత్వానికి మద్దతిస్తే అవి దేశాన్ని 'లోపలి నుంచే నాశనం చేస్తాయి' అని నెతన్యాహు గతంలో అన్నట్లు వాటి కథనం. దానికి ప్రతిగా నెతన్యాహు సమాజంలో విభజనలు సృష్టిస్తున్నారని ఐజెన్‌కోట్ ఆరోపించారు. ఇజ్రాయెలీ పౌరులైన అరబ్బులు 'విధేయతా పరీక్ష' ఎదుర్కొంటున్నారని కొన్ని విశ్లేషణలు అంటున్నాయి. అరబ్ పౌరులు ఓటు వేసింది మార్పు కోసమే, వారి ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని అబ్బాస్ భావిస్తున్నారని కథనాలు చెబుతున్నాయి.

ఈ రాజకీయ సందిగ్ధతకు అంతర్జాతీయ నేపథ్యం కూడా తోడైంది. నవంబర్ 3న, అంటే అమెరికా మధ్యంతర ఎన్నికల రోజున, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక ప్రకటన చేశారు. ఇజ్రాయెల్‌కు ఏటా ఇస్తున్న సుమారు 4 బిలియన్ డాలర్ల సహాయాన్ని ఈ ఏడాది తర్వాత నిలిపివేస్తామని చెప్పారు. ఇది తాను, నెతన్యాహు కుదుర్చుకున్న ఒప్పందమని, అయితే ఆయుధాల అమ్మకాలు కొనసాగుతాయన్నారు. ఇరాన్ అనుకూల చానల్ అల్-ఆలం దీన్ని అమెరికా 'నెతన్యాహుకు దూరమవుతోంది' అన్న కోణంలో చూపింది. కానీ అసలు ప్రకటన స్వరం వేరు. ఇది నెతన్యాహుతో కలిసి తీసుకున్న నిర్ణయమని ట్రంప్ చెప్పారు. నెతన్యాహు కూడా గతంలో అమెరికా సైనిక సహాయాన్ని క్రమంగా తగ్గించుకునే అవసరం గురించి బహిరంగంగా మాట్లాడిన సంగతి ఉంది. ఆ ప్రకటనపై అనేక సందేహాలున్నాయి. ఒబామా కాలంలో 2016లో కుదిరిన ఒప్పందం ప్రకారం ఏటా 3.8 బిలియన్ డాలర్ల సహాయం 2028 వరకు ఉంది. అలాగే సహాయ నిధులను కాంగ్రెస్ మంజూరు చేస్తుంది, అధ్యక్షుడు ఒక్కరే నిర్ణయించలేరు. అందువల్ల నిపుణులు ఈ కోత గడువు ప్రకారం పూర్తిగా అమలవుతుందా? అని ప్రశ్నిస్తున్నారు. అమెరికా కాంగ్రెస్ ఇప్పుడు డెమోక్రాట్ల చేతిలోకి వెళ్లింది. అక్కడి డెమోక్రాట్లలో చాలామంది సైనిక సహాయంపై షరతులు పెట్టాలనే వైఖరితో ఉన్నారు. కాబట్టి ఇజ్రాయెల్ కొత్త ప్రభుత్వం ఎవరి చేతిలోవున్నా, అమెరికాతో సంబంధాల స్వభావం మారే అవకాశాలు ఎక్కువే. ఈ పరిణామాలన్నీ ఇజ్రాయెల్‌కు కీలక సమయంలో వచ్చాయి. గాజా, లెబనాన్, ఇరాన్ చుట్టూ ఉన్న ఉద్రిక్తతల నీడలో దేశం రాజకీయంగా తీవ్రంగా చీలిపోయి ఉంది. భద్రతా సవాళ్ల మధ్య స్థిరమైన ప్రభుత్వం కావాలని ప్రజలు కోరుకుంటారు. కానీ ఏ ప్రభుత్వం ఏర్పడినా అది సులువుగా నిలబడే పరిస్థితి కనిపించడం లేదు. ఐజెన్‌కోట్ గడువులోగా అవసరమైన మద్దతు కూడగట్టలేకపోతే, అధ్యక్షుడు మరొకరికి అవకాశం ఇవ్వవచ్చు. ఆ అవకాశం మళ్లీ నెతన్యాహుకు రావచ్చు. అన్ని ప్రయత్నాలూ విఫలమైతే నెసెట్ రద్దయి మళ్లీ ఎన్నికలు జరుగుతాయి. అంటే రాబోయే కొన్ని వారాలు ఇజ్రాయెల్ ప్రజాస్వామ్యానికి పరీక్షా కాలం. భిన్న శక్తులను ఒకే గొడుగు కిందికి తెచ్చే సామర్థ్యం ఐజెన్‌కోట్‌కు ఉందా, సైద్ధాంతిక విభేదాలను పక్కన పెట్టడానికి ప్రతిపక్షాలు సిద్ధమా, నెతన్యాహు తన రాజకీయ అనుభవంతో ఈ ప్రక్రియను అడ్డుకోగలరా.. వీటికి సమాధానాలు త్వరలో తెలుస్తాయి. ఏదేమైనా, పౌరులందరి ఓటుకు విలువ ఇచ్చే వ్యవస్థను నిలబెట్టుకోవడమే పరీక్షలో అసలైన విజయం! ■

పనికొచ్చే పలుకు



నా కోసమే నేను

ఒక నాటక రిహార్సల్ హాల్. దర్శకుడు నటులందరినీ ఒక ప్రశ్న అడిగారు: "మీరు ఎవరి కోసం నటిస్తున్నారు?" కొందరు "అమ్మ కోసం" అన్నారు, కొందరు "కుటుంబం కోసం" అన్నారు. చివరగా ఒక యువ నటి లేచి, "నిజం చెప్పాలంటే, నా కోసమే నటిస్తున్నాను" అని చెప్పింది. గదిలో నిశ్శబ్దం. తర్వాత అందరి మెప్పు. ఆమె కేట్ విన్స్‌లెట్ అని, తన కెరీర్ తొలి రోజుల్లో జరిగిన సంఘటనగా ఆమె ఒక ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నారని వార్తలు చెబుతున్నాయి. టైటానిక్‌తో ప్రపంచానికి తెలిసిన ఈ నటి ఆస్కార్, ఎమ్మీ, బాఫ్టా, గోల్డెన్ గ్లోబ్, గ్రామీవంటి పురస్కారాలు అందుకున్నారు.

ఈ మాట వెనుక ఉన్న విశ్లేషణ

"అందరినీ ఎప్పుడూ సంతృప్తి పరచడం ఎవరికీ సాధ్యం కాదు" అనే ఆమె భావనలో ఒక లోతైన సత్యం ఉంది. మనం చేసే చాలా పనులు నిజానికి ఎవరో ఒకరి మెప్పు కోసమే. బంధువులు ఏమంటారో, సోషల్ మీడియాలో ఎంతమంది లైక్ చేస్తారో, ఆఫీసులో మేనేజర్ ఏం అనుకుంటారో అని మనం ఆలోచిస్తూ జీవిస్తాం. ఇక్కడ ఒక ప్రమాదం ఉంది. మెప్పు కోసం చేసిన పని విఫలమైతే నింద ఇతరులపైకి వెళ్తుంది. "వాళ్లే కారణం" అన్న భావన పెరిగి, మనం ఏమీ నేర్చుకోలేం. కానీ మన కోసం మనం చేసిన పని విఫలమైతే, బాధ్యత మనదే అన్న అవగాహన వస్తుంది. అదే మెరుగుదలకు మొదటి మెట్టు. కేట్ చెప్పిన "స్వీయ బాధ్యతే స్వేచ్ఛ" అంటే ఇదే.

మీ జీవితంలో ఎలా అమలు చేయాలి?

ప్రతి పనికి ముందు ఒక ప్రశ్న వేసుకోండి. "ఇది నేను ఎవరి కోసం చేస్తున్నాను?" సమాధానం "నా లక్ష్యం కోసం" అయితే ముందుకు వెళ్లండి. "ఎవరో ఏమనుకుంటారో అని" అయితే ఒక్క నిమిషం ఆగండి.

విఫలమైనప్పుడు ఒక్క వాక్యం రాయండి. "ఈసారి నేను ఏం మార్చి ఉండాలి?" అని. కారణాలను ఇతరులపై కాకుండా మీ చేతుల్లో ఉన్న వాటిపై వెతకండి.


ఇతరుల అభిప్రాయాలను వడపోయండి. అందరి మాటలూ సమానం కావు. మిమ్మల్ని నిజంగా అర్థం చేసుకునే ఇద్దరు ముగ్గురి సలహాను విలువైనదిగా తీసుకోండి. మిగతా శబ్దాన్ని తగ్గించండి.

వారంలో ఒక పనిని కేవలం మీ కోసం చేయండి. ఎవరికీ చూపించకుండా, పోస్ట్ చేయకుండా. పాట పాడడం, పుస్తకం చదవడం, ఏదైనా నేర్చుకోవడం. అది మీ ఆనందానికి మీరే మూలం కావడం నేర్పుతుంది.

ఒక జాగ్రత్త

స్వీయ బాధ్యత అంటే ఇతరుల మాటలను పూర్తిగా పట్టించుకోకపోవడం కాదు. సలహా వినాలి, విమర్శ నుంచి నేర్చుకోవాలి. కానీ తుది నిర్ణయం, దాని ఫలితం ఎప్పుడూ మన భుజాలపైనే ఉంటాయి.

మెప్పు కోసం జీవించేవారు ప్రతి చప్పట్లకూ బానిసలవుతారు. తన కోసం జీవించేవారు చప్పట్లు ఆగినా ముందుకు సాగుతారు. మీరు ఎవరి కోసం నడుస్తున్నారో ఈ రోజే నిర్ణయించుకోండి.



ఉదయం మన రోజుకు తొలి పుటలాంటిది. కళ్లు తెరవగానే ఫోన్ తీస్తే, ఇతరుల సందేశాలు మన ఆలోచనల్ని ఆక్రమించేస్తాయి. అలా కాకుండా మొదటి కొన్ని గంటలను మీకోసమే మీరు కేటాయించండి. ఆ సమయంలో కఠినమైన వ్యాయామం చేయండి, కొత్త విషయం నేర్చుకునేందుకు చదవండి, మీ ఆలోచనలను రాయండి. అన్నింటికన్నా కష్టమైన పనిని ముందే పూర్తి చేయండి. అప్పుడు మనసు తేలికవుతుంది, ఏకాగ్రత పెరుగుతుంది. రోజంతా మిగిలిన పనులు సులువుగా సాగుతాయి. ఉదయాన్ని గెలిచినవాడు రోజునూ గెలుస్తాడు.

-మహాదేవ

వింతల్లో వింతలు

బీన్‌ను కదిలిద్దాం!



అమెరికాలోని చికాగో మిలీనియం పార్క్‌లో వందల మంది గుమిగూడారు. లక్ష్యం ఏంటంటే, అక్కడి ప్రసిద్ధ 'క్లౌడ్ గేట్' (ది బీన్) శిల్పాన్ని ఏడంగుళాలు ఎడమవైపు నెట్టడం! లోపల ఒక మనిషి చిక్కుకున్నాడని, కింద తలుపు ఉందని, అతనికి ఊరగాయ ఇవ్వాలని నిర్వాహకుల సరదా సిద్ధాంతం. సుమారు 250 మంది ఒక్కసారి తోసినా శిల్పం ఇంచు కూడా కదల్లేదు. ఒక నిర్వాహకుడు మొదట "ఒక అంగుళం కదిలింది" అని ప్రకటించి, తర్వాత "అసలు కదల్లేదు" అని సరిదిద్దుకున్నాడు. కదలకపోయినా అందరూ నవ్వుతూ ఇంటికెళ్లారు.

పురుష క్రికెటర్లతో సమానంగా మమ్మల్నీ గుర్తించండి: పాక్ కెప్టెన్ ఫాతిమా సనా

- పురుషుల క్రికెట్‌తో సమానంగా మహిళల క్రికెట్ కు ఆదరణ దక్కాలన్న ఫాతిమా సనా
- డబ్ల్యూబీబీఎల్‌లో పెర్త్ స్కార్చర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సనా
- ఈ లీగ్‌లో ఆడుతున్న రెండో పాకిస్థాన్ మహిళా క్రికెటర్
- 2028 టీ20 వరల్డ్ కప్‌తో పెను మార్పులు ఖాయమన్న ఆశాభావం
- మెగా టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న పాక్



పాకిస్థాన్‌లో పురుషుల క్రికెట్‌తో సమానంగా మహిళల క్రికెట్‌కు కూడా గుర్తింపు, ఆదరణ దక్కాలని ఆ దేశ మహిళల జట్టు కెప్టెన్ ఫాతిమా సనా ఆకాంక్షను వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్)లో పెర్త్ స్కార్చర్స్ జట్టుకు ఆమె ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫాతిమా సనా మాట్లాడుతూ, మహిళల క్రికెట్‌లో సమగ్ర మార్పు రావాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. పాకిస్థాన్‌లో పురుషుల క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు స్టేడియాలు కిక్కిరిసిపోవడం, మీడియా నుంచి విపరీతమైన ప్రచారం లభించడం సర్వసాధారణమని, సరిగ్గా అలాంటి వాతావరణం, ఉత్సాహం మహిళల మ్యాచ్‌లకు కూడా దక్కాలన్నదే తన ప్రధాన లక్ష్యమని ఫాతిమా సనా పేర్కొంది. మైదానంలో మహిళా క్రికెటర్లు సైతం పూర్తి స్థాయిలో శ్రమిస్తున్నారని, వారికి కూడా సమాన స్థాయిలో అభిమానుల మద్దతు అవసరమని ఆమె అభిప్రాయపడింది. ఈ ఏడాది అంతర్జాతీయ క్రికెట్‌లో కేవలం 15 బంతుల్లోనే మెరుపు అర్ధశతకం సాధించి ప్రపంచ రికార్డు సృష్టించిన ఫాతిమా సనా, మహిళల బిగ్ బాష్ లీగ్‌లో అడుగుపెట్టిన రెండో పాకిస్థానీ క్రీడాకారిణిగా నిలిచింది. గతంలో 2019లో నిదా దార్ ఈ లీగ్‌లో ఆడగా, మళ్లీ ఇన్నాళ్లకు ఫాతిమాకు ఈ అవకాశం లభించింది. డబ్ల్యూబీబీఎల్ వంటి నాణ్యమైన అంతర్జాతీయ లీగ్‌లలో ఆడటం వల్ల నైపుణ్యాలు మెరుగుపడతాయని, తన అనుభవం భవిష్యత్తులో మరింత మంది పాకిస్థానీ అమ్మాయిలు విదేశీ లీగ్‌లకు ఎంపికయ్యేందుకు మార్గం సుగమం చేస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది. మరోవైపు, 2028లో జరగనున్న మహిళల టీ20 ప్రపంచకప్‌కు పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుండటంపై ఫాతిమా సనా స్పందిస్తూ.. ఈ మెగా ఈవెంట్ దేశంలో మహిళల క్రీడారంగానికి ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుందని చెప్పింది. సొంత గడ్డపై ప్రపంచకప్ నిర్వహించడం ద్వారా స్థానిక బాలికల్లో క్రికెట్ పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని, మహిళల క్రికెట్‌ను చూసే దృక్పథంలోనూ స్పష్టమైన మార్పు వస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది. క్రీడారంగంలో లింగ సమానత్వం దిశగా అడుగులు పడటానికి ఇలాంటి భారీ టోర్నీలు దోహదపడతాయని ఫాతిమా సనా స్పష్టం చేసింది.

‘శ్రేయస్.. నీ వెనక నేనున్నా’.. పంజాబ్‌కు మారిన తర్వాత హార్దిక్ ఫస్ట్ రియాక్షన్



ఐపీఎల్‌లో కీలక ఆటగాళ్ల ట్రేడింగ్ వ్యవహారం క్రికెట్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టులోకి మారనున్న నేపథ్యంలో ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బలమైన సందేశం పంపించాడు. కెప్టెన్ శ్రేయస్, కోచ్ రికీ పాంటింగ్ సహా పంజాబ్ జట్టు మొత్తానికి తాను అండగా ఉంటానని స్పష్టం చేశాడు. పంజాబ్ జెర్సీతో ఉన్న ఫొటోను కూడా పంచుకున్నాడు. రెండుసార్లు ఐపీఎల్ ఫైనల్‌కు చేరిన పంజాబ్ కింగ్స్‌తో కలిసి పనిచేయడం పట్ల హార్దిక్ ఉత్సాహం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ‘నా కెప్టెన్ శ్రేయస్.. నా కోచ్ రికీ.. నా జట్టు.. పంజాబ్ మొత్తం.. మీ వెనక నేనున్నా’ అంటూ పోస్ట్ చేశాడు. తన ఆల్‌రౌండ్ నైపుణ్యాలతో జట్టుకు ఉపయోగపడతాననే సంకేతాలిచ్చాడు. ఐపీఎల్ చరిత్రలోనే కీలకమైన ఆటగాళ్ల మార్పిడిలో భాగంగా పంజాబ్ కింగ్స్‌కు హార్దిక్ వెళ్లనున్నాడు. అతడి స్థానంలో భారత టీ20 బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌లో చేరనున్నాడు. ఈ ట్రేడింగ్‌లో హార్దిక్ పారితోషికం రూ. 16.35 కోట్ల నుంచి రూ. 18 కోట్లకు పెరగనుంది. అర్ష్‌దీప్ మాత్రం తన ప్రస్తుత రూ. 18 కోట్ల పారితోషికంతోనే ముంబై జట్టుకు మారనున్నాడు. హార్దిక్‌కు ముంబై ఇండియన్స్‌తో సుదీర్ఘ అనుబంధం ఉంది. 2015లో ఆ జట్టులో చేరిన అతడు 2015, 2017, 2019, 2020 సీజన్లలో టైటిళ్లు గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఏడు సీజన్ల తర్వాత గుజరాత్ టైటాన్స్‌కు మారి, తొలి సీజన్‌లోనే కెప్టెన్‌గా టైటిల్ అందించాడు. 2023లోనూ ఆ జట్టును ఫైనల్‌కు చేర్చాడు. 2024లో తిరిగి ముంబైకి వచ్చి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. మొత్తం 162 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో హార్దిక్ 2,955 పరుగులు చేయడంతోపాటు 82 వికెట్లు పడగొట్టాడు. అయితే ముంబైతో రెండో విడత మూడేళ్ల ప్రయాణంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. 39 మ్యాచ్‌ల్లో 647 పరుగులు, 29 వికెట్లు సాధించాడు. అతడి కెప్టెన్సీలో ముంబై 2025లో ప్లేఆఫ్స్‌కు చేరగా, 2024, 2026 సీజన్లలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. మరోవైపు అర్ష్‌దీప్ 2019లో పంజాబ్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఆ జట్టు తరఫున 96 మ్యాచ్‌ల్లో 111 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. 2025 సీజన్‌లో 21 వికెట్లు, 2026లో 14 వికెట్లు పడగొట్టాడు. కొత్త బంతితో వికెట్లు తీయడంతోపాటు డెత్ ఓవర్లలోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం అతడికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది.

హార్దిక్ పాండ్యాకు థ్యాంక్స్ చెప్పిన ముంబై.. ఎమోషనల్ వీడియోతో వీడ్కోలు!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో మరో సంచలన ట్రేడ్ చోటుచేసుకుంది. ముంబై ఇండియన్స్ (ఎంఐ) కెప్టెన్ హార్దిక్ పాండ్యాను పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్) జట్టుకు బదిలీ చేశారు. ఈ భారీ ఒప్పందంలో భాగంగా పంజాబ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్ జట్టులోకి వచ్చాడు. హార్దిక్ కెప్టెన్సీలో ముంబై ప్రదర్శన నిరాశపరచడంతో ఫ్రాంచైజీ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బదిలీతో ముంబై ఇండియన్స్‌తో హార్దిక్ రెండో ఇన్నింగ్స్‌కు తెరపడినట్లయింది. ఈ సందర్భంగా హార్దిక్ పాండ్యాకు ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ భావోద్వేగంగా వీడ్కోలు పలికింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ లో ప్రత్యేక పోస్టులు పెట్టింది. “జట్టు కోసం ఎంతో ఇష్టంతో, గర్వంతో ఆడిన హార్దిక్‌కు ధన్యవాదాలు. నీ భవిష్యత్ ప్రయాణం విజయవంతం కావాలని కోరుకుంటున్నాం” అని ఒక పోస్టులో పేర్కొంది. మరో పోస్టులో జట్టు కష్టసుఖాల్లో భాగమైనందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఒక ఎమోషనల్ వీడియోను పంచుకుంది. 2015లో తొలిసారి ముంబై ఇండియన్స్ జట్టులో చేరిన హార్దిక్, ఆ జట్టు నాలుగుసార్లు (2015, 2017, 2019, 2020) టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. బ్యాట్, బంతితో అద్భుత ప్రదర్శన చేసి స్టార్ ఆల్‌రౌండర్‌గా ఎదిగాడు. అయితే, గుజరాత్ టైటాన్స్ జట్టుకు రెండేళ్లు ఆడి, మళ్లీ 2024లో ముంబైకి తిరిగి వచ్చాడు. రోహిత్ శర్మ స్థానంలో కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. కానీ, కెప్టెన్‌గా హార్దిక్ రెండో ప్రయాణం ఆశించినంత విజయవంతం కాలేదు. గత మూడు సీజన్లలో రెండుసార్లు ముంబై జట్టు ప్లేఆఫ్స్‌కు కూడా అర్హత సాధించలేకపోయింది. ఈ కాలంలో వ్యక్తిగతంగానూ హార్దిక్ రాణించలేకపోయాడు. అతను కేవలం 647 పరుగులు చేసి, 35 వికెట్లు మాత్రమే తీశాడు. ఈ పేలవ ప్రదర్శన కారణంగానే ఫ్రాంచైజీ అతడిని వదులుకోవాలని నిర్ణయించుకుంది. ఈ ట్రేడ్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్ హార్దిక్‌ను రూ. 18 కోట్లకు దక్కించుకుంది. గత సీజన్‌లో అతని జీతం రూ. 16.35 కోట్లు కాగా, ఇప్పుడు మరింత పెరిగింది. తన ఐపీఎల్ కెరీర్‌లో ఇప్పటివరకు 162 మ్యాచ్‌లు ఆడిన హార్దిక్, 146.28 స్ట్రైక్ రేట్‌తో 2,955 పరుగులు చేసి, 82 వికెట్లు పడగొట్టాడు. ముంబైతో సుదీర్ఘ అనుబంధం ముగించుకుని, హార్దిక్ ఇప్పుడు పంజాబ్ కింగ్స్ తరఫున కొత్త ప్రయాణాన్ని ప్రారంభించనున్నాడు.

వైట్ క్రాప్ టాప్‌లో గ్లామర్ ట్రీట్ ఇచ్చిన దిశా పటానీ!

బాలీవుడ్ గ్లామర్ క్వీన్ దిశా పటానీ సోషల్ మీడియాలో అడుగుపెడితే చాలు.. ఇంటర్నెట్ షేక్ అవ్వాల్సిందే. ఎప్పటికప్పుడు లేటెస్ట్ ఫోటోషూట్లతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేసే ఈ బ్యూటీ, తాజాగా ఆల్-వైట్ ఇండో-వెస్ట్రన్ ఫ్యూజన్ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోయింది. ఒకవైపు ట్రెడిషనల్ టచ్ ఇస్తూనే, మరోవైపు తన మార్క్ గ్లామర్‌తో ఫ్యాన్స్‌కి అదిరిపోయే విజువల్ ట్రీట్ ఇచ్చింది. ఆ ఫోటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

ఆల్-వైట్ డ్రెస్‌లో అద్భుతమైన లుక్:

ఈ ఫోటోషూట్‌లో దిశా పటానీ వేసుకున్న వైట్ డ్రెస్ చాలా స్పెషల్‌గా ఉంది. సిల్వర్ వర్క్ చేసిన వైట్ క్రాప్ టాప్, దానికి మ్యాచింగ్‌గా ఫ్లోర్-లెంగ్త్ స్కర్ట్ ధరించింది. దీనిపైకి వేసుకున్న పొడవాటి నెట్ జాకెట్, చేతులకు ఉన్న ఎంబ్రాయిడరీ డిజైన్ ఆమె లుక్‌కి మరింత గ్రేస్ తీసుకొచ్చాయి. లైట్‌గా వేవ్స్‌లా వదిలేసిన జుట్టు, పింక్ ఇయర్ రింగ్స్‌తో దిశా పటానీ అచ్చం ఏంజెల్‌లా మెరిసిపోతోంది.



తెరపై హాట్.. బయట మాత్రం చాలా సిగ్గరి:

సినిమాల్లో బోల్డ్ క్యారెక్టర్లు, అదిరిపోయే డ్యాన్స్ స్టెప్పులతో దిశా రచ్చ చేస్తుంటుంది. కెమెరా ఆన్ అయితే చాలు తనలోని గ్లామర్ యాంగిల్ బయటకు వస్తుంది. కానీ రియల్ లైఫ్‌లో తను చాలా సిగ్గరి అని దిశానే స్వయంగా చాలాసార్లు చెప్పింది. ఇక పబ్లిక్ ఈవెంట్స్‌లో నలుగురి ముందు మాట్లాడాలంటే ఇప్పటికీ తనకు కొంచెం మొహమాటం అని ఆమె గతం లో తెలిపారు.

టైగర్ ష్రాఫ్ ఇంటి వద్ద దిశా సందడి!:

ఇక పర్సనల్ విషయాలకు వస్తే.. రీసెంట్‌గా హీరో టైగర్ ష్రాఫ్‌పై దాడి జరిగిన కొన్ని గంటల్లోనే దిశా ఆయన ఇంటికి వెళ్లింది. వైట్ టాప్, బ్లూ జీన్స్ వేసుకుని, చేతిలో ఒక కేర్ ప్యాకేజీ పట్టుకుని టైగర్ ఇంటికి వెళ్తున్న వీడియో బయటకు రావడంతో, వీళ్లిద్దరి మధ్య ఉన్న బాండింగ్‌పై మళ్లీ చర్చ మొదలైంది.

ఓటీటీలోనూ దుమ్మురేపుతున్న బ్లాక్‌బస్టర్:

ఇక మరోవైపు కెరీర్ పరంగానూ దిశా ఫుల్ ఫామ్‌లో ఉంది. ఇమ్రాన్ హష్మీతో కలిసి ఆమె నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ బాక్సాఫీస్ దగ్గర 200 కోట్లకు పైగా వసూలు చేసి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇటీవల అమెజాన్ ప్రైమ్ వీడియోలో రిలీజైన ఈ సినిమా, ఎలాంటి అంచనాలు లేకుండానే మొదటి రోజు నుంచే నంబర్ 1 స్థానంలో ట్రెండ్ అవుతూ రికార్డులు క్రియేట్ చేస్తోంది. ఇక మొత్తానికి ఒకవైపు 200 కోట్ల బ్లాక్‌బస్టర్ సినిమాతో, మరోవైపు ఈ వైట్ డ్రెస్ ఫోటోషూట్‌తో దిశా పటానీ వార్తల్లో నిలుస్తోంది. గ్లామర్ విషయంలో తనకు తిరుగులేదని మరోసారి ప్రూవ్ చేసుకున్న ఈ బ్యూటీ, రాబోయే ‘ఆవారాపన్ 2’ సినిమాతో ఇంకెన్ని సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965